ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 20 నవంబరు 2024 | 5



175 చోట్ల విషతుల్యం..

తూర్పు,మధ్య డెల్టాల పరిధిలో 175 చోట్ల గోదావరి కాలువల్లో నీళ్ల విషతుల్యంగా మారిన ట్టు నీటిపారుదలశాఖ రెండేళ్ల కిందటే గుర్తించింది.కాలువల వెంబడి వ్యర్థాలపై డ్రోన్లతో పంచాయతీలు,మునిసిపాల్టీలు సర్వే చేశాయి. అత్యధికంగా కోనసీమలో కోళ్ల,రొయ్యల వ్యర్థాలు, కడి యం,ద్వారపూడి,అనపర్తి,బిక్కవోలు,సామర్లకోట పరిధిలో 68 చోట్ల కాలువలు నీళ్ల వ్యర్థాలతో విషపూరితంగా మారినట్టు నిర్ధారించారు. కొన్నిచోట్ల పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు నేరుగా కలిసిపోతున్నట్టు తేల్చారు.ఇవన్నీ పంటపొలాలకు చేరడంతో పంటలు నష్టపోవడం,భూగర్భ జలాలు సైతం కలుషితమైనట్టు ఆయాశాఖలు తేల్చాయి. కాలువలు కాలుష్యంగా మారినచోట వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి అప్పట్లో ప్రయత్నించారు.కానీ అప్పటి ప్రభుత్వం ప్రచారం కోసం మినహా పైసా కూడా ఇవ్వకపోవడంతో ప్రతిపాదనలన్నీ మూలనపడ్డాయి.

ప్రత్యేకావసరాల పిల్లల ప్రోత్సాహకాలకు

రూ.51.08 లక్షలు విడుదల

చాలా ఏళ్ల తర్వాత నిధులు రావడంతో హర్షం



భవిత కేంద్రంలో చిన్నారికి ఫిజియోథెరపీ

అమలాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థ నేటికీ అనేక సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. పాఠశాలల్లో చదువుకునే సాధారణ విద్యార్థులతో పాటు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందించాల్సిన వివిధ రకాల ప్రోత్సాహకాలను వైసీపీ ప్రభుత్వ హయాంలో విడుదల చేయలేదు. ప్రభుత్వ ప్రోత్సాహకాల కోసం ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు ఎదురు చూస్తూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే పది నెలల బకాయిలను ఒకేసారి రూ.51.08 లక్షలు విడుదల చేసింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి చిన్నారులకు అందించే అన్ని రకాల ప్రోత్సాహకాలకు సంబంధించిన నిధులను విడుదల చేసింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసేలా సమగ్ర శిక్ష జిల్లాశాఖ కార్యాచరణ చేపట్టింది. పాఠశాల లేని గ్రామాల నుంచి ఇతర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు వెళ్లి చదువుకునే విద్యార్థులకు రవాణా ఖర్చులు చెల్లించాలని విద్యా హక్కు చట్టం చెబుతుంది. దీని ప్రకారం ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.6వేలు చొప్పున ప్రభుత్వం పంపిణీ చేస్తుంది.

అలవెన్సులు అందక.. తల్లిదండ్రుల ఆవేదన

ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం మండలానికి ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు చిన్నారులను తీసుకువచ్చే తల్లిదండ్రులకు ఎస్కార్ట్ అలవెన్సుల కింద నెలకు రూ.300 చొప్పున అందించాల్సి ఉంది. వీరికి పది నెలల కాలానికి రూ.3వేలు చొప్పున నిధులు విడుదలయ్యాయి. కొందరు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు పాఠశాలలకు వస్తుంటారు. వారికి కూడా నెలకు రూ.300 చొప్పున ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో ఉన్న చిన్నారులకు కూడా నెలకు రూ.300 చొప్పున చెల్లించాల్సి ఉంది. చిన్నారుల్లో బాలికలు ఉంటే ఇతర అలవెన్సులతో పాటు నెలకు రూ.200 చొప్పున అందించాల్సి ఉంది. ఇలాంటి ప్రోత్సాహకాలు గత వైసీపీ ప్రభుత్వంలో తూతూ మంత్రంగా అందించారు. కూటమి ప్రభుత్వం అన్ని ప్రోత్సాహకాల కింద జిల్లాకు రూ.51.08 లక్షలు విడుదల చేసింది. ఈ నిధులను మరో మూడు రోజుల్లో విద్యార్థుల ఖాతాలకు జమ చేయనున్నట్లు సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. హోం బేస్డ్ అలవెన్స్ కింద రూ.6.60 లక్షలు, ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.12.15 లక్షలు, ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ కింద రూ.14.07 లక్షలు, బాలికల అలవెన్స్ కింద రూ.18.26 లక్షలు విడుదలయ్యాయని చెప్పారు.



గోదారంతా.. గరళమే!



ఈ వ్యర్థం.. అనర్థమే : కాలువలను కలుషితం చేస్తున్న వ్యర్థాలు

ఒకనాడు గోదావరి కాలువల్లో నీటిని చేతితో ఒడిసిపట్టి తాగేవాళ్లం.. ఇప్పుడు ఆ నీరు తాగాలంటేనే భయమేస్తోంది.. ఇదీ ఒక 70 ఏళ్ల పెద్దాయన మాట.. మేం గతంలో గోదావరి కాలువల నీటినే బిందెలతో తెచ్చుకుని తాగేవాళ్లం.. ఇప్పుడు నీటిని కొనుక్కుని తాగుతున్నాం.. ఇదీ 60 ఏళ్ల బామ్మ మాట..ఎందుకంటే నాటికి నేటికి గోదావరి కాలువల నిర్వహణలో ఎంతో తేడా ఉంది.. ప్రస్తుతం కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోయాయి.. నీళ్లు తాగడం కాదు.. స్నానం చేయడానికే భయపడేంతగా నీళ్లు కలుషితమయ్యాయి.. రెండేళ్ల కిందట ఈ విషయం గుర్తించినా గత వైసీపీ ప్రభుత్వం మాటలు తప్ప.. అలాగే వదిలేసింది.. ఈ విషయం తెలియని ప్రజలు ఆ నీటినే తాగి రోగాల బారినపడ్డారు.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం క్లీన్ గోదావరిపై దృష్టి సారించాల్సి ఉంది.. లేదంటే మరింత ప్రమాదం ముంచుకొస్తుంది..!

175 ప్రాంతాల్లో కాలువలు కలుషితం

- రెండేళ్ల కిందటే అధికారుల నివేదిక
- నాటి సీఎం రూ.100 కోట్ల హామీ
- రూపాయి కూడా విదల్చని వైనం
- కాలుష్య రహితం చేస్తామని గొప్పలు
- అటకెక్కిన 'మిషన్ క్లీన్ గోదావరి'
- ఉమ్మడి జిల్లాలకు కలుషిత నీళ్లు
- వేలాది మందికి ఈ నీళ్లే దిక్కు
- నేటికీ మారని తీరు
- ఎక్కడికక్కడ యథేచ్ఛగా వ్యర్థాలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)


ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టు అటకెక్కిపోయింది. నాలుగేళ్ల నుంచీ పనుల్లో అతీగతీలేక ఎక్కడిదక్కడే అన్నట్లు ఆగిపోయింది.ఉమ్మడి జిల్లాలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోయిన నేపథ్యంలో వాటిని శుద్ధి చేస్తామని ప్రకటించి గత వైసీపీ సర్కారు గాలికొదిలేసింది.ఈ నీటిని శుద్ధి చేశాకే పంట కాలువల్లోకి నీరు వదులుతామని ప్రగల్భాలు పలికింది. ఈ ప్రాజెక్టుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్టు గొప్పలు చెప్పిన అప్పటి సీఎం జగన్ తీరా నిధుల మంజూరును కాగితాలకే పరిమితం చేశారు.కానీ క్షేత్రస్థాయిలో గత నాలుగేళ్లుగా కనీసం పట్టించుకోకపోవడంతో కాలువలు దయనీయంగా మారాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో 175 చోట్ల గోదావరి కాలువల వద్ద కాలుష్యం తీవ్రంగా ఉందని గుర్తించారు. కూటమి ప్రభుత్వం కాలువల బాగుపై దృష్టిసారించాలని అన్నదాతలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన మిషన్ క్లీన్ గోదావరి కార్యాలయం ఇప్పటికీ కొనసాగుతున్న నేపథ్యంలో కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని అటు జలవనరులశాఖ భావిస్తోంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

ఎక్కడికక్కడ భయానకం...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ప్రధాన కాలువలు తూర్పు,మధ్యడెల్టాల పరిధిలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. మధ్య డెల్టా కింద కోనసీమ,తూర్పుడెల్టా కింద ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు కాలువలు, డ్రైన్ల ద్వారా గోదావరి నీరు ప్రవహిస్తోంది. ఈ నీళ్లు లక్షల ఎకరాల సాగు,తాగునీటికి ఆధారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా గోదావరి కాలువలు కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. వీటి వెంబడి ఉన్న వందలాది గ్రామాల్లో పరిస్థితి దారుణంగా మారింది. గృహనిర్మాణ వ్యర్థాలు,చికెన్, మద్యం దుకాణాల మొదలు క్షవరశాలలు, వందలాది వాణిజ్య దుకాణాల్లో వ్యర్థాలను కాలువల్లో వదిలేస్తున్నారు. కడియం నుంచి కాకినాడ వరకు, ఆత్రేయపురం నుంచి అమలాపురం వరకు కాలువలకు సమీపంలో వందలాది కోళ్లఫారాలు ఉన్నాయి. వీటిల్లోని వందల టన్నుల వ్యర్థాలను డ్రమ్ముల్లో తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. అనపర్తి, కడియం, బిక్కవోలు, ద్వారపూడి, సామర్లకోట, కాకినాడ, కోనసీమ పరిధిలోని కాలువల్లో ఈ తరహా వ్యర్థాలు కలిపేస్తు న్నారు. కోనసీమ పరిధిలో రొయ్యల చెరువుల్లో వాడిన నీటిని పైపులతో గోదావరి కాలువలకు మళ్లిస్తున్నారు.ఇలా ఎక్కడికక్కడ కాలువలు విషమయం అవుతుండగా, ఆ నీటిని తాగే మూగజీవాలు తరచూ మృత్యువాత పడుతున్నా బయటకు తెలియడం లేదు. పంచాయతీల పరిధిలోని మురుగుకాలువల నీటినీ కాలువల్లోకే తరలిస్తున్నారు. ఇదంతా ఒకెత్తయితే రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట వరకు కాలువలకు సమీపంలో అనేక రకాల పరిశ్రమలున్నాయి.వీటిలో కాలుష్య జలాలను శుద్ధిచేసి భూమిలోకి వెళ్లేలా చేయాలి.కానీ ఖర్చుసాకుతో గుట్టుగా పైపుల్లోంచి గోదావరి కాలువల్లోకి కలిపేస్తున్నారు. రాజమహేంద్రవరంలో మురుగునీటిని నల్లా ఛానల్ ద్వారా గోదావరిలో కలిపేస్తారు. కలుషితం అని తెలిసినా ఈ నీటినే ఓ మోస్తరు శుద్ధిచేసి పంచాయతీలు,మునిసిపాలిటీలు,కార్పొరేషన్లు ప్రజలకు తాగునీటిగాసరఫరా చేస్తున్నాయి.

నాడు గాలికొదిలేసిన వైసీపీ

గత వైసీపీ సర్కారు మిషన్ క్లీన్ గోదావరి పేరుతో ప్రత్యేక ప్రాజెక్టును 2019 సెప్టెంబరులో ప్రారంభించింది.సీఎం ఛైర్మన్‌గా ఉండే ఈ బోర్డు ద్వారా జిల్లాలో గోదావరి కాలువలను శుద్ధి చేసి,ఆ తర్వాతే నీటిని కాలువల్లోకి వదులుతామని.. రూ.100 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్టు అప్పటి సీఎం జగన్ పలు సమీక్షల్లో గొప్పగా ప్రకటించారు.ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాలువల వద్ద ఎక్కడెక్కడ పరిస్థితి తీవ్రంగా ఉందో అధ్యయనం చేశారు. తీరా నిధులు అవసరమైన తరుణంలో అప్పటి ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా నిధులు మంజూరు చేయలేదు. కేవలం నిధులిస్తున్నట్టు కాగితాలపై ఆదేశాలు జారీచేశారు. ఇలా మొన్న దిగిపోయే వరకు వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై మాటలు తప్పించి పనులు జరిగేలా కనీస శ్రద్ధ చూప లేదు. దీంతో మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టు పూర్తిగా అటకెక్కినట్లయ్యింది. గత ఐదేళ్లలో గోదావరి కాలువల నిర్వహణను జగన్ సర్కారు గాలికివదిలేసింది.అటు పూడిక పెరగడం, మరో పక్క కాలుష్య తీవ్రత మరింత పెరిగి ప్రస్తుతం అత్యంత హానికరంగా తయారయ్యాయి.



ఇంత దారుణమా : కాలువ ఒడ్డున వేసిన చెత్త

కూటమి..పట్టాలెక్కించాలి..

కూటమి ప్రభుత్వం గోదావరి కాలువలపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టుకు ఇటీవల ఓ ఐఏఎస్‌ను కూడా సర్కారు నియమించింది.దీంతో ఎంతో కొంత నిధులు, లేదా కంపెనీల సీఎస్ఆర్ నిధుల సాయంతో కాలువల ప్రక్షాళన చేయాల్సి ఉంది.ఇదే విషయమై జలవన రుల శాఖ సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టుకు గత ప్రభుత్వం పైసా కూడా ఇవ్వని నేపథ్యంలో ఏం చేయలేకపోయామని దీంతో కాలుష్య తీవ్రత మరింత పెరిగిందని వివరించింది.కూటమి ప్రభుత్వం గోదావరి కాలువల్లో కాలుష్యాన్ని నివారించే ప్రాజెక్టును పట్టాలెక్కి స్తుందని ఆయాశాఖల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.

మాజీ ఎంపీ కేఎస్సార్ తనయుడే కాగ్ చీఫ్ 6లో



సంజయ్‌మూర్తి

- కాగ్ చీఫ్‌గా కె.సంజయ్‌మూర్తి నియామకం
- 1996లో ఎంపీగా పనిచేసిన కేఎస్సార్ మూర్తి
- ఈ ప్రాంత ప్రజలతో సంజయ్‌మూర్తికి సత్సంబంధాలు



సోషల్ మీడియాలో వికృత క్రీడ 6లో

గీత దాటితే తప్పవు కేసులు, జైలు

అసెంబ్లీలో ఆక్వా సమస్యలపై గళం విప్పిన ఎమ్మెల్యే దాట్ల



ముమ్మిడివరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో కోరారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అవగాహన లేక ఆక్వారంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల 10లక్షల టన్నులు ఉండే ఆక్వా ఎగుమతులు 6 లక్షల టన్నులకు పడిపోయాయన్నారు. విద్యుత్ సబ్సిడీ విషయంలో జోన్, నాన్‌జోన్‌గా విడదీయడంతో నాన్‌జోన్‌గా ఉన్న రైతులు నష్టపోతున్నారన్నారు. రాష్ట్రంలో 66 వేల ఆక్వా విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఆక్వాజోన్ పరిధిలో 54వేల కనెక్షన్లు ఉన్నాయని, 12 వేల విద్యుత్ కనెక్షన్లు నాన్‌జోన్ పరిధిలోకి రావడంతో వాటికి విద్యుత్ సబ్సిడీ వర్తించడం లేదన్నారు. ఆక్వా చెరువుల వద్ద ఏర్పాటు చేసుకునే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వైసీపీ ప్రభుత్వం సొంత సంస్థకు అప్పగించడంతో వారు వాటి ధరను రెండు రెట్లు చేశారన్నారు. దీంతో ఆక్వా రైతులపై ఆర్థికభారం పడిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏరియేటర్లకు కూడా సబ్సిడీ ఇచ్చేవాళ్లమని, విద్యుత్ యూనిట్ రూ.5.85 ఉండే దాన్ని రెండు దఫాలుగా రూ.2కు తీసుకువచ్చినట్లు చెప్పారు. ఆక్వా, హేచరీ పరిశ్రమలను కూడా ఆక్వారంగ పరిధిలోకి తీసుకువచ్చి విద్యుత్ సబ్సిడీని 50 శాతం ఇవ్వాలన్నారు. శీతాకాలం సీజన్‌లో విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుందని, అయితే ఆక్వా చెరువులకు శీతాకాలం సీజన్‌లో ఎక్కువ విద్యుత్ అవసరమన్నారు. ఆక్వా రైతులు మాగ్జిమం డిమాండ్ మించి విద్యుత్‌ను వాడడం వల్ల వారు అదనపు చార్జీ చెల్లించాల్సి వస్తుందని వారికి 100 హెచ్‌పీ సరిపోదని వాటిని రెట్టింపు చేయాలన్నారు. మాగ్జిమం డిమాండ్ పరిమితి లేకుండా విద్యుత్ సంస్థలు, ఆక్వా రైతులకు లాభం చేకూరుతుందన్నారు. చెరువులు ఉన్న ప్రాంతాల్లో ఆక్వా నర్సరీలు ఏర్పాటు చేసుకుంటున్నారని, అయితే అక్కడ అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు రాష్ట్రం విడిపోయినా హైదరాబాద్‌లోనే ఉందని, దాన్ని కాకినాడలో గానీ విశాఖపట్నంలో ఏర్పాటుచేస్తే ఆక్వారైతులకు మేలుగా ఉంటుందన్నారు. ఎన్నికల ముందు ఆక్వా రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఆక్వా జోన్, నాన్‌జోన్ అనే బేధం లేకుండా ఆక్వా రైతులకు రూ.2.50కే విద్యుత్‌ను అందించి ఆర్థికంగా నష్టపోయిన వారిని ఆదుకోవాలన్నారు. ఆక్వారైతుల విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి రూ.10లక్షల లోపు టర్నసీ విధానం అమలులో ఉండేదని, దాన్ని గత ప్రభుత్వం రూ.40లక్షలకు పెంచిందని దాన్ని రూ.10లక్షలకు మార్చాలని ఆయన కోరారు.

కోనసీమను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

అసెంబ్లీలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అసెంబ్లీలో ప్రస్తావించారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కోనసీమ ప్రాంతం పారిశ్రామికంగా వెనుకబడి ఉందని కేరళ తరహాలో పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఎకో టూరిజానికే కాకుండా టెంపుల్ టూరిజానికి కూడా అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి, మందపల్లి శనేశ్వరస్వామి, అయినవిల్లి వినాయకస్వామి, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు వంటి పుణ్యక్షేత్రాలు కలిగిన ప్రాంతం గనుక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్పీకర్ ద్వారా సంబంధిత మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకుని వెళ్లారు.

డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయ రంగంలో

విప్లవాత్మక మార్పులు

- పైలెట్ ప్రాజెక్టుగా కోనసీమ, సత్యసాయి జిల్లాలు ఎంపిక
- కలెక్టర్ మహేష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు రానున్నాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ అందించే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (కర్నూలు) సాంకేతిక ప్రతినిధులు కె.కృష్ణనాయక్, నరేష్‌బాబు, విష్ణుమూర్తి కలెక్టర్‌తో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శిక్షణా సంస్థ ద్వారా రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయంపై పైలెట్ ప్రాజెక్టుగా డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సత్యసాయి జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్స్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. గోదావరి భవన్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రయోగాత్మకంగా డ్రోన్లను వినియోగిస్తారన్నారు. జిల్లాలోని మూడు డివిజన్ల నుంచి రెండేసి మండలాలను ఎంపికచేసి వంద మంది విద్యావంతులైన అభ్యుదయ రైతులు, మరో వంద మంది విద్యావంతులైన స్వయం సహాయక సంఘాల మహిళలను ఎంపిక చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. డ్రోన్స్ సాంకేతిక సహాయకులుగా మరో 30 మంది, అగ్రికల్చర్ బీఎస్సీ చదివిన విద్యార్థులను ఎంపికచేసి డిసెంబరు రెండో వారంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 1500 ఎకరాలకు ఒక డ్రోన్ చొప్పున ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ ఆధారిత మండలాల్లోని డ్వాక్రా సంఘాలకు డ్రోన్ దీదీ పథకం ద్వారా డ్రోన్స్ కొనుగోలుకు రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేయడంతో పాటు రూ.8 లక్షలు సబ్సిడీగా అందిస్తారన్నారు. మండల మహిళా సమాఖ్య రూ.2లక్షలు కంట్రిబ్యూషన్‌గా చెల్లిస్తుందన్నారు. డ్రోన్స్ సహాయంతో వ్యవసాయం వల్ల రైతులకు పెట్టుబడులు తగ్గి లాభదాయకంగా మారుతుందని వివరించారు. డ్రోన్స్ వినియోగం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. శక్తివంతమైన సెన్సార్లు, హై రిసొల్యూషన్ కెమెరాలతో డ్రోన్లు రైతులు పండించే పంటలకు పట్టిన చీడపీడలు, పోషకాహార లోపాలు, నీటికొరత వంటి సమస్యలను గుర్తిస్తాయన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై విస్తృత ప్రచారం నిర్వహించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

అమలాపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. మన మరుగుదొడ్డి-మనగౌరవం పేరిట పల్లెలు, పట్టణాల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ, తాగునీరు-పారిశుధ్యశాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 10 వరకు స్వచ్ఛతా కార్యక్రమాల నిర్వహణపై రూపొందించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్ది పారిశుధ్య అంశాలపై ప్రచారంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవన్నీ హైజనిక్‌గా ఉండేలా పాఠశాల రివాల్వింగ్ ఫండ్‌ను వినియోగించి నిర్వహణ మెరుగుపరచాలన్నారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎస్వీ కృష్ణారెడ్డి, డీఈ పద్మనాభం పాల్గొన్నారు.



పిల్లలకూ ఉంది.. రాజ్యాంగం

రేపటి పౌరుల పరిరక్షణ దేశానికి రక్షణ

పిల్లలకు బాధ్యతలూ నేర్పడమూ పెద్దల బాధ్యతే

నేడు బాలల హక్కుల సంరక్షణ దినం

రాజమహేంద్రవరం/కార్పొరేషన్(కాకినాడ), నవంబరు19(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులని అంటారు. అది అక్షర సత్యమే. ఆ బాలల హక్కులను కాపాడుతూ, బాధ్యతలను అలవర్చినప్పుడే మంచి సమాజం తద్వారా మెరుగైన దేశాన్ని చూడవచ్చు. బాలలకు ప్రత్యేక హక్కులు సంక్రమించి మూడు దశాబ్ధాలు దాటినా వాటి అమలు వెనుకబడిపోయింది. బడిలో ఉండాల్సిన బాల్యం దుకాణాల్లో బండెడు చాకిరీ చేస్తోంది. సిగ్నళ్ల వద్ద చిన్నారులు యాచించడం వ్యవస్థల అలసత్వాన్ని వెక్కిరిస్తోంది. అక్షరాలు దిద్దాల్సిన వయసు వెట్టిచాకిరీల్లో మగ్గిపోతోంది. బాల్యవివాహాల్లో చిన్నారి వధువులు సమిధలుగా మారిపోతున్నారు. నేడు బాలల హక్కుల పరిరక్షణ దినోత్సం సందర్భంగా జాతి సంపద హక్కులపై కథనం..

బాలలకు ప్రత్యేక హక్కులు

ప్రపంచవ్యాప్తంగా పిల్లల సంక్షేమాన్ని సంరక్షించడానికి ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1959 నవంబరు 20న బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది. అందువల్ల ఆ రోజున బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పెద్దవాళ్లకు ఉండే హక్కులన్నీ పిల్లలకూ రాజ్యాంగం అందించింది. రేపటి పౌరుల కోసం ఐక్యరాజ్య సమితి 1989లో దేశాల నడుమ ఒడంబడిక ద్వారా బాలలకు ప్రత్యేక హక్కులను ఇచ్చింది. మన దేశం వాటిని 1992లో ఆమోదించి ఒడంబడికపై సంతకం చేసింది. అప్పటి నుంచీ బాలల హక్కులు సంరక్షించడానికి, అమలుచేయడానికి వివిధ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. బాలల హక్కుల ఒడంబడికలో 1 నుంచి 41 వరకూ బాలలకు సంబంధించిన అంశాలు, 42 నుంచి 46 వరకూ వాటిని అమలు చేసే విధానాలు, 47 నుంచి 54 వరకూ అంతర్జాతీయ ప్రమాణాలు, బాధ్యతల గురించి వివరించారు. వీటి ప్రకారం 18ఏళ్లలోపు వయసు వారందరినీ బాలలుగానే పరిగణిస్తారు. బాలల హక్కులను నాలుగు మూల సూత్రాల ఆధారంగా రూపొందించారు. వివక్షతకు తావు ఉండకుండా బాలల అభిప్రాయాలకు అత్యున్నత ప్రాధాన్యమివ్వాలని, వారికి జీవించే హక్కును కల్పించడంతోపాటు భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కును అందించాలనే మూల స్తంభాల మీద బాలల హక్కుల ఒడంబడిక కుదిరింది. మొత్తం హక్కులను జీవించే, రక్షణ పొందే, అభివృద్ధి చెందే, భాగస్వామ్యం పొందే హక్కులుగా విభజించారు.

కాకినాడ జిల్లాలో...

బాలల హక్కుల కోసం కాకినాడ జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 2024లో 250 పాఠశాలలు, 30 కళాశాలల్లో అవగాహన తరగతులు, 36 బాల్యవివాహాలు నిలుపుదల, భిక్షాటన చేసే 35 పిల్లలను రెస్క్యూ చేసి 14మందిని తల్లిదండ్రులకు అప్పగించి 21మందిని పాఠశాలల్లో చేర్పడం జరిగింది. గత సంవత్సరాల్లో ఫోక్సో బాధిత బాలికలకు ఈ ఏడాది 75 మందికి పరిహారం ఇచ్చారు. అనాధలుగా నిరాదరణకు లోనైన 410 మంది బాలలకు స్పాన్సర్‌షిప్ అమౌంట్ ఇచ్చారు. అనాధలుగా వదిలివేసిన 11మంది బాలలకు టీఏఆర్ఏ ద్వారా దత్తత ప్రక్రియ పూర్తి చేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



సమాజంలో ప్రతి ఒక్కరూ బాలలపై లైంగిక వేధింపులను వ్యతిరేకించాలి. ఎక్కడైనా బాలలను వేధింపులకు గురిచేస్తే ఉపేక్షించకూడదు. ఎవరైనా ఎటువంటి ఆపదలో ఉన్నా, టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారమివ్వాలి. ప్రభుత్వపరంగా సమాజంలో బాలల హక్కుల పరిరక్షణకు మా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చిన్నారి రక్షణ, కిశోర వికాసం వంటి కార్యక్రమాలు నిర్వహణతోపాటు వారి రక్షణ, పరిరక్షణకు ఎంతగానో కృషి చేస్తున్నాం.

- కొండా ప్రవీణ, కాకినాడ జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ పీడీ





పి.మల్లవరంలో వరిచేలో బర్మాబ్లాక్ వరి సాగు.. రైతు రమణ

ఈ రైతు రూటే సెపరేటు

ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శ రైతు

బర్మా బ్లాక్, మణిపూర్ బ్లాక్, మైసూర్ మల్లిగా రకాలతో వరి సాగు

తాళ్లరేవు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులతో పనిలేకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను సాధించే దిశగా కొందరు రైతులు ప్రకృతి వ్యవసాయం బాటపడుతున్నారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయ సేద్యం వైపు మళ్లేలా రైతు దూళిపూడి వెంకట రమణ అనే రైతు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రామంలో 50 సెంట్ల వరిపొలంలో ప్రకృతి వ్యవసాయ సాగును ప్రాజెక్టుగా తీసుకుని జీవామృతం, కషాయాలతో వ్యవసాయ సాగుచేశారు. 50 సెంట్లలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆకుమడి దమ్ముకి రూ.1500, 7 కిలోలను ఆకుమడి విత్తనాలు చల్లారు. దీనికి కిలో రూ.140 చొప్పున 7 కిలోల ఖర్చు రూ.980 అయింది. అలాగే గట్టులంకలకు రూ.1200, వరినాట్లు వేయడానికి రూ.2000, రెండుసార్లు కసాయంలను పిచికారి చేయడానికి రూ.1200 ఖర్చయ్యిందంటున్నారు. ప్రస్తుతం బర్మా బ్లాక్ వరి రకాన్ని మాత్రమే సాగుచేశానని, మణిపూర్ బ్లాక్, మైసూర్ మల్లిగా వరి రకాలను సాగు కోసం సిద్ధం చేసుకున్నట్టు రైతు వెంకట రమణ తెలిపారు. పంట బాగుందని, ఎలాంటి చీడపీడలతో నష్టం జరగలేదని ఆయన చెప్పారు.

ఈ బియ్యంతో ప్రయోజనాలెన్నో..

బర్మా బ్లాక్, మణిపూర్ బ్లాక్ వంటి విత్తనాలు.. నలుపు రంగులో ఉంటాయి. అధిక యాంటీ ఆక్సిడెంట్ కంటెంట్ కలిగినవి. ఈ బియ్యం వల్ల కలిగే కేన్సర్, డయాబెటిస్, గుండె జబ్బులు వంటి అనారోగ్యాల బారిన నుంచి రక్షణ కల్పిస్తుంది. ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను సైతం తగ్గిస్తుంది. ఈ బియ్యంలో విటమిన్ బి, ఇ, నియాసిన్, కాల్షియం, మెగ్నిషియం, ఐరన్, జింకు వంటి ఖనిజ విలువలు, పీచు పదార్థాలు అధికం. ఈ బియ్యంలో అంకోసైనిన్స్, యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేయడమేగాక రోగనిరోధక ఎంజైములను క్రియాశీలకం చేస్తుందని చెబుతున్నారు.

మైసూర్ మల్లిగా..

మైసూర్ మల్లిగా రకం సంప్రదాయ రకాల్లో ఒకటి. బియ్యం తెలుపు రంగులో ఉంటుంది. ఎదిగే పిల్లలకు అవసరమైన అధిక పోషకాలు, ప్రొటీన్స్ లభించే గుణం కలిగి ఉంది. పిల్లలకు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. పిల్లలకు ఈ బియ్యంతో ఆరోగ్య సంబంధమైన ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయం సాగులో ఈ రకాన్ని ఎక్కువ పండిస్తున్నారు.

స్టాంపులకు.. ఆధారమే!



కూటమి సర్కారు నూతన విధానం

» తప్పనిసరి చేసిన ప్రభుత్వం
» అక్రమాల నియంత్రణే లక్ష్యం
» నకిలీలకు అడ్డుకట్ట
» కృత్రిమ కొరతకు చెక్

పెద్దాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వాడే నాన్ జుడీషియల్ స్టాంపు అమ్మకాలు తీరును సంస్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. స్టాంపుల అమ్మకాల్లో అక్రమాలను అరికట్టడానికి కొత్త నిబంధనలు తెచ్చింది.గత వైసీపీ ప్రభుత్వం ఈ స్టాంపింగ్‌ను ప్రవేశపెట్టి ప్రజల నుంచి వ్యతిరేకతను మూటకట్టుకుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం నాన్ జుడీషియల్ స్టాంపుల వైపే మొగ్గు చూపింది. ఇందుకు అనుగుణంగా నాసిక్ నుంచి పెద్ద సంఖ్యలో స్టాంపులను తెప్పించి అన్ని జిల్లాలకు సరఫరా చేసింది. నాన్ జుడీషియల్ స్టాంపులు కావాలంటే గతంలో ఒక ఫారంలో పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలు నమోదుచేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తే స్టాంపులు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంపు వెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుంటారు. అయితే కొందరు వెండర్లు ఎక్కువ సంఖ్యలో స్టాంపులు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించే వారన్న విమర్శలున్నాయి. స్టాంపు కాగితాలపై పాత తేదీలను వేసి ఇవ్వడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యేవి. నకిలీ స్టాంపులు కొన్ని చోట్ల బహిర్గతమైన సందర్భాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది.ఇందుకు అనుగుణంగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఆధార్ తప్పనిసరి ..

ఒకటి, అంతకన్నా ఎక్కువగా నాన్ జుడీషియల్ స్టాంపులు కొనుగోలు చేసినా కొత్త విధా నంలో మొత్తం వివరాలు కంప్యూటర్‌లో నమో దు చేసుకోవాల్సిందే. స్టాంపులు పొందడానికి ఆధార్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆధార్ నెంబరును కంప్యూటర్‌లో నమోదు చేయాలి. వివరాల నమోదు తరువాత కొనుగోలుదారుడి మొబైల్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్‌లో చూపిస్తే స్టాంపులు ఇస్తారు. ఒక వ్యక్తి ఐదు నుంచి 10 స్టాంపులు వరకూ కొనుగోలు చేసుకోవచ్చు. ఆధార్ నెంబర్ నమోదు చేయడం వల్ల ఎవరు ఎన్ని స్టాంపులు కొనుగోలు చేశారో తెలుస్తుంది.

లెక్క తెలిసిపోతుందిలా..

స్టాంపుల విక్రయాల్లో గతంలో మాదిరిగా రికార్డుల్లో రాసి స్టాంపులు ఇచ్చే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. రిజిస్టర్లు , అకౌంట్ పుస్తకాలు కలిగి ఉండే స్టాంపు వెండర్లు కూడా ఇప్పుడు తప్పనిసరిగా కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాల్సిందే. నూతన విధానంలో వెండర్ల వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్లలో ఏఏ స్టాంపులు ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని అధికారులు తెలుసుకునే అవకా శం కలిగింది.ఈ క్రమంలో విక్రయాలు తక్కు వగా జరిగే కార్యాలయాల నుంచి ఎక్కువ వినియోగం ఉండే కార్యాలయాలకు స్టాంపులను తెప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా స్టాంపుల కృత్రిమ కొరతకు చెక్ పడుతుంది. కూటమి ప్రభుత్వ ఆలోచనపై హర్షం వ్యక్తమవుతుంది. ఎందుకంటే స్టాంప్‌ల కారణంగా చాలా ఇబ్బందులు ఉంటాయి. ఆధార్ నెంబర్ తప్పనిసరి చేయడంతో ఆ ఇబ్బందులు కొంత వరకూ తగ్గే అవకాశం ఉంటుంది.

అందుబాటులో స్టాంపులు

నాన్ జుడీషియల్ స్టాంపులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్‌లో ఆధార్ నంబర్ నమోదు చేసుకుని స్టాంపులు విక్రయించాలి. నగదు ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది.స్టాంపు వెండర్లు నిబంధనల ప్రకారం విక్రయాలు జరపాలి.

- కె.ఆనందరావు, జిల్లా రిజిస్ట్రార్, కాకినాడ



సోషల్ మీడియాలో వికృత క్రీడ!

- గీత దాటితే తప్పవు కేసులు, జైలు
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఎసరే
- తునిలో డిజిటల్ మీడియాలో అభ్యంతరకర, అసభ్య పోస్టులు పెడుతున్న 17 మంది అరెస్టు

తునిరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. రాజకీయ ప్రచారానికి వినియోగించడంతోపాటు ప్రత్యర్థులు, వారి కుటుంబీకులు, ఆ కుటుంబాల మహిళలు, చిన్నపిల్లలపై బూతులతో విరుచుకుపడుతున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. మార్ఫింగ్ ఫొటోలతో తమ పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. తమ ఇష్టమైన నేతల కళ్లల్లో ఆనందం కోసం వికృత చేష్టలతో ఇతరులను తూలనాడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. వీరిలో విద్యార్థికులే అధికంగా ఉండడం, అందులోని ఎక్కువశాతం యువకులు ఉండడం ఆందోళన కలిగించే అంశం. సామాజిక మాధ్యమాల్లో ఈ తరహా సైకోలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించింది. తునిలో వైసీపీ సానుభూతి పరులు తమ నేత కళ్లల్లో ఆనందం చూడడం కోసం సోషల్ మీడియా వేదికపై వికృత చేష్టలకు పాల్పడుతూ పెద్దసంఖ్యలో పోలీసులు పట్టుపడుతున్నారు. ఇప్పటికే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఫేక్ అకౌంట్లతో రాజకీయ నాయకులు, వారి కుటుంబీకులపై అనుచిత వ్యాఖ్యలకు పాల్పడుతున్న వారిపై వారిని గురించి 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. తీగ లాగితే డొంక కదిలిందన్న చందాన వీరి సోషల్ మీడియా అకౌంట్‌లకు తుని నుంచి రాష్ట్ర నలుమూలల నుంచి సంబంధాలు ఉండడంతో పోలీసులు మరింతగా దర్యాప్తు చేస్తున్నారు. ఈసందర్భంగా పోలీసులు యువతను చైతన్యపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో గీత దాటితే వేటు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, యువత అప్రమత్తం అవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఫేక్, మార్ఫింగ్ పోస్టింగ్‌లు పెడితే..

ఫేక్, మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలు పెడితే అవతల వారి వ్యక్తిత్వాన్ని అవమానిస్తే డీఎన్ఎస్ 67 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువు అయితే 3 ఏళ్ల జైలుశిక్ష, రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తారు.

● అసభ్యకర పోస్టులు పెడితే..

67ఏ సెక్షన్ కింద కేసు నమోదవుతుంది. 5 ఏళ్ల జైలుశిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఇంకా...

- ప్రముఖ వ్యక్తుల పేరుతో అసభ్యకర పోస్టులు పెడితే 66(డి)సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తారు. 3 ఏళ్ళు జైలుశిక్ష, రూ.1 లక్ష వరకు జరిమానా విధిస్తారు.
- తప్పుడు పత్రాలు సృష్టించి ఒక వ్యక్తి పరువుకుభంగం కలిగిస్తే బీఎన్ఎస్ చట్టంలోని 336(4)సెక్షన్ కింద కేసు పెడతారు.
- సంఘంలోని సమూహాలు, సంఘాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే బీఎన్ఎస్ చట్టంలోని 362(2)సెక్షన్‌తో పాటు పరువు నష్టం కింద కేసు నమోదవుతుంది.
- జుగుప్సాకరంగా ఉన్న చిత్రాలు, ఫొటోలు పోస్ట్ చేస్తే ఎలక్ట్రానిక్ ఆధారాలుగా పరిగణించి బీఎన్ఎస్ చట్టంలోని 353(2)కింద కేసు తప్పదు.

● ఈ కేసుల్లో ఇరుకుంటే..

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టే వారిలో యువత, విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నారు. ఈ కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగ నియామక సమయంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారు. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఉద్యోగాల నియామకాల సమయంలో పోలీస్‌శాఖ నిరంభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ)పత్రం జారీచేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తే వారిపై కేసు నమోదై ఉంటే వారికి ఎన్‌ఓసీ జారీచేయరు. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాలకు వెళ్లేవారికి పాస్‌పోర్టు జారీ సమయంలో ఇబ్బంది తప్పదు. కేసులు నమోదై ఉంటే పోలీసుల తనిఖీ సమయంలో తోసిపుచ్చుతారు. కొందరు ఈపాటికే విదేశాల్లో ఉండి అక్కడ నుంచి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర మార్ఫింగ్ ఫోటోలతో పోస్టులు పెడుతున్నారు. తాము దూరం ప్రాంతంలో ఉన్నామనే భ్రమలో రెచ్చిపోతున్నారు. అటువంటి వారిపై కేసు నమోదైతే లుక్‌అవుట్ జారీచేస్తారు. దేశంలో ఎప్పుడైనా అడుగుపెడితే పోలీసులు అదుపులోకి తీసుకుంటారు.

● పరిశీలనలో ప్రతి ఖాతా : సీఐ

సామాజిక మధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టినా అసభ్యకర పదజాలంతో రెచ్చిపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు చెప్పారు. సైబర్ క్రైం, సామాజిక మాధ్యమాలపై సైబర్ సెల్ విభాగం పూర్తిగా నిఘా పెట్టిందని, రోత పోస్టులు పెడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

తునిలో 17 మంది అరెస్టు.. రిమాండ్

తుని రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం వంటి డిజిటల్ సోషల్ మీడియా వేదికల్లో ప్రభుత్వంపైనా, ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలకు వ్యతిరేకంగా వైసీపీకి లబ్ధి చేకూర్చేలా ప్రచారం చేస్తూ రాజకీయ అనిశ్చితిను ప్రేరేపించేందుకు పాల్పడుతున్న వారిపై కాకినాడ జిల్లా తుని పట్టణ, గ్రామీణ పోలీసులు కొరడా ఝుళిపించారు. సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారానికి పాల్పడుతున్న 17 మందిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి పలువురిని రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో నాగం గంగబాబు, అడపా సురేష్, గణేశుల వీరబాబు, చింతకాయల చినబాబు, బంగారు బ్రహ్మానాయుడు, యలమంచిలి మణికంఠ, చింతమనీడి గణేష్, కాకినాడ నానితోపాటు తుని మునిసిపల్ కౌన్సిలర్ షేక్ క్వాజా మెహిద్దీన్, ఏలూరి బాలు, వెలుగొండి జార్జ్ కిరణ్, ఇసరపు సాయి, మొగసాల నాగ రామశ్రీను, ఇబ్బ శ్రీను, పెంటకోట వెంకటరమణ, కోరుమిల్లి లలితపై కేసులు నమోదు చేసినట్టు రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. దీనిపై విచారణ కొనసాగుతుందని, విచారణ అనంతరం ఇందులో ఇంకా ఎవరి భాగస్వామ్యమైనా ఉంటే అరెస్టు చేస్తామన్నారు. యువత సోషల్ మీడియాలో కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ నాశనం అవుతుందని ఆయన హెచ్చరించారు.



తునిలో మీడియాతో మాట్లాడుతున్న తుని పట్టణ, రూరల్ సీఐలు చెన్నకేశవరావు, గీతారామకృష్ణ



కాకినాడ రేచర్లపేటలోని ఇల్లు.. కాగ్ చీఫ్ సంజయ్‌మూర్తి

కాగ్ చీఫ్ మనోడే

మాజీ ఎంపీ కేఎస్సార్ తనయుడే సంజయ్‌మూర్తి

1996లో ఎంపీగా పనిచేసిన కేఎస్ఆర్.మూర్తి

ఈ ప్రాంత ప్రజలతో సంజయ్‌మూర్తికి సంబంధాలు

అమలాపురం/కాకినాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) చీఫ్‌గా నియమితులైన కె.సంజయ్‌మూర్తికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో సంబంధాలు ఉన్నాయి. గతంలో ఆయన తండ్రి విశ్రాంత ఐఏఎస్ అధికారి కేఎస్సార్ మూర్తి కాంగ్రెస్ పార్టీ నుంచి అమలాపురం లోక్‌సభ రిజర్వుడ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఆ సమయంలో ఆయన తనయుడైన కె.సంజయ్‌మూర్తి పలు సందర్భాల్లో కోనసీమ ప్రాంతంలో పర్యటించారు. ఈ ప్రాంత ముఖ్యులతో పరిచయాలు కలిగి ఉన్నారు. 1996లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కేఎస్సార్ మూర్తి కాంగ్రెస్ పార్టీ నుంచి అమలాపురం ఎంపీ స్థానానికి ఎన్నికయ్యారు. అంతకు పూర్వం నుంచే సీనియర్ ఐఏఎస్ హోదాలో ఈ ప్రాంత ప్రజలతో సంబంధాలు, బంధుత్వాలు కూడా మూర్తికి కలిగి ఉన్నాయి. ఈ జిల్లాలోని ముమ్మిడివరంలోని బాలయోగీశ్వరుల ఆలయం నిర్వహణలో కేఎస్సార్ మూర్తి కీలక పాత్ర వహించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఆయన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. తండ్రి అడుగు జాడల్లోనే నడిచే సీనియర్ ఐఏఎస్ అధికారిగా కె.సంజయ్‌మూర్తికి మంచి పేరు ఉంది. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ కేడర్ నుంచి కాగ్‌కు ఎంపికయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము కె.సంజయ్‌మూర్తిని కాగ్ చీఫ్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం సంజయ్‌మూర్తి కేంద్ర విద్యాశాఖలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈనెల 21న సంజయ్ పదవీ బాధ్యతలను చేపట్టనున్నారు. కాకినాడ జిల్లా రేచర్లపేటకు చెందిన కేఎస్సార్ మూర్తి దంపతులకు సంజయ్‌మూర్తి జన్మించారు. ఎంపీగా పనిచేసిన ఆయన తండ్రి కేఎస్సార్ మూర్తికి కోనసీమలో మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. కాంగ్రెస్ హయాంలో కోనసీమలో మంచినీటి పథకాల అమలుకు కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తుల్లో కేఎస్సార్ మూర్తి ఒకరు. ఈ ప్రాంతంలో అప్పట్లో జరిగిన కార్యక్రమాలకు తనయుడు సంజయ్‌మూర్తి కూడా అప్పుడప్పుడూ హాజరై ప్రజలతో మమేకమయ్యేవారు.

పెరిగింది కాకినాడలోనే..

భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా నియమితులైన తొలి తెలుగు వ్యక్తి సంజయ్ మూర్తిది కాకినాడ కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అత్యున్నత పదవి తొలిసారిగా తెలుగు అధికారికి దక్కడం, అదీ ఆయన కాకినాడ రేచర్లపేటకు చెందిన వారు కావడంతో ఆయన గురించి తెలిసిన వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంజయ్ మూర్తి తండ్రి కోండ్రు శ్రీరామచంద్రమూర్తి 1996లో అమలాపురం ఎంపీగా పనిచేశారు. అంతకు ముందు ఐఏఎస్ అధికారిగా వివిధ హోదాల్లో పనిచేశారు.ఎంపీగా చేసిన కాలంలో కాకినాడ రేచర్లపేటలోని సొంతింట్లోనే ఉండేవారు. అదే సమయంలో తల్లితో కలిసి కొంతకాలం ఇక్కడే సంజయ్‌మూర్తి ఉన్నారు.తండ్రి ఐఏఎస్ కావడంతో సంజయ్‌మూర్తి చదువంతా ఎక్కువగా హైదరాబాద్‌లోనే గడిచింది.ఆ తర్వాత సంజయ్ 1989లో ఐఏఎస్‌కు ఎంపికవడంతో హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌లో చాలాకాలం పనిచేశారు. పండగ సమయాల్లో మాత్రం కాకినాడ రేచర్లపేటకు వచ్చి కొన్నిరోజులు గడిపేవారు. రేచర్లపేటలోని సొంతింట్లో ప్రస్తుతం సంజయ్ కుటుంబీకులు ఎవరూ లేరు.కొన్నాళ్ల కిందట సంజయ్‌మూర్తి తల్లిదండ్రులు చనిపోవడంతో ఉంటున్న ఇంటిని అద్దెకు ఇచ్చేశారు.



ఎంత మంది పిల్లలున్నా పోటీకి ఓకే!

- స్థానిక సంస్థలకు సంతానం నిబంధన ఎత్తివేత
- చట్ట సవరణ చేస్తూ ప్రభుత్వ నిర్ణయం

పెద్దాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటి వరకూ ఉన్న ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయనున్నారు. ఇకపై ఎంత మంది పిల్లలు ఉన్నా పట్టణ స్థాయి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులుగా ప్రకటించింది.ఈ బిల్లు 2024లోనే అమల్లోకి రానుంది.ఈ మేరకు మునిసిపల్ మంత్రి నారాయణ సభలో సైతం ప్రతిపాదించారు. జనాబా వృద్ధి రేటు పెంపుదలలో భాగంగానే చట్టంలో మార్పులు తెచ్చినట్టు స్పష్టం చేశారు. మునిసిపల్ శాసనాల సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం కూడా తెలిపింది. ఈ మేరకు చట్టానికి సైతం సవరణలు చేయనున్నారు. స్థానిక సంస్థల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని ఎప్పటి నుంచో వస్తున్న డిమాండ్లకు కూటమి ప్రభుత్వం అమోదం తెలియచేయడంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే పట్టణ స్థానిక సంస్థల అభ్యర్థులకు ఏఏ సందర్భాల్లో ఇందులో మినహాయింపులతో కూడిన వెసులుబాటు లభిస్తుందనే విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి వివరణ ఇవ్వాల్సి ఉంది. శాసనమండలి ఆమోదం పొందిన తరువాత జీవో జారీ చేయగానే కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని ప్రకటించారు. గతంలో ఇద్దరు కంటే ఎక్కువ సంతానం ఉన్న వారు పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత లేకుండా ఉండేవారు. కొత్త నిబంధనతో ఎంత మంది పిల్లలు ఉన్నా ఎన్నికల్లో పోటీకి అర్హులే.

ఒక్కటైన ఐఏఎస్‌లు

- విశాఖలో ప్రేమ వివాహం..
- బిళ్లకుర్రులో రిసెప్షన్

కొత్తపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ఐఏఎస్‌లు.. ప్రేమ వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. కొత్తపేట మండలం బిళ్లకుర్రులో రిసెప్షన్ వేడుక నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండలం బిళ్లకుర్రు తరిట్లవారిపేటకు చెందిన తరిట్ల ధర్మారావు మధ్యప్రదేశ్‌లో కలెక్టర్‌గా పనిచేశారు. ఆయన కుమారుడు తరిట్ల ప్రతీక్‌రావు, హైదరాబాద్‌కు చెందిన కె.అనీషా.. ఇద్దరూ 2023లో ఢిల్లీ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ పొందారు. అప్పటి పరిచయం మేరకు వీరిద్దరూ విశాఖలో ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రతీక్‌రావు స్వగ్రామమైన తరిట్లవారిపేటలో మంగళవారం పెద్దల సమక్షంలో రిసెప్షన్ వేడుక ఘనంగా నిర్వహించగా పలువురు హాజరై ఆశీర్వదించారు.


కొత్తపేట మండలం బిళ్లకుర్రు తరిట్లవారిపేటలో రిసెప్షన్‌లో ఐఏఎస్‌లు

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.73 కోట్లు

అన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.1,73,10,259 నగదు, 28.500 గ్రాముల బంగారం, 862 గ్రాముల వెండి లభించింది. వీటితోపాటు యుఎస్ఏకు చెందిన 162 డాలర్లు, కెనడా 15 డాలర్లు, ఇంగ్లాండ్ 20 పౌండ్స్, ఆస్ట్రేలియా 25 డాలర్లతోపాటు పలు దేశాల విదేశీ కరెన్సీ సమకూరాయి. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 20 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.8.65 లక్షల ఆదాయం హుండీల ద్వారా లభించింది.


హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

వచ్చేనెల 28న క్రియ పిల్లల పండుగ

- కాకినాడ జేఎన్‌టీయూ వేదికగా నిర్వహణ

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు19(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 28, 29 తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో క్రియ పిల్లల పండుగ నిర్వహించనున్నారు. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. దీనిలో భాగంగా 11వ రాష్ట్రస్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు జరగనున్నాయి. విద్యార్థులకు నాటికలు, శాస్త్రీయ నృత్యం, కోలాటం, పాటలు, పోస్టర్ ప్రజంటేషన్, కథారచన, చిత్రలేఖనం, బుర్రకథ, జానపదనృత్యం, విచిత్ర వేషధారణ, కథ చెప్పడం, వాద్య సంగీతం వంటి పోటీలు నిర్వహిస్తారు. 400 పాఠశాలల నుంచి 12వేల మంది వరకు విద్యార్థులు వస్తారని అంచనా వేస్తున్నారు. 1నుంచి 5వ తరగతి వరకు సబ్‌జూనియర్ కేటగిరీలో, 6 నుంచి 7వ తరగతి వరకు జూనియర్ కేటగిరీలో, 8 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ కేటగిరీలో పోటీలు జరుగుతాయి. www.kriyaonline.org వెబ్‌సైట్ ద్వారా స్కూల్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చును.

సక్రమంగా ఆరుగురి నామినేషన్లు

- కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్‌లు పరిశీలన చేశారు. ఆరుగురు అభ్యర్థులు వేసిన నామినేషన్లు సక్రమంగా ఉన్నాయన్నారు. మంగళవారం నామినేషన్లను ఎవరూ ఉపసంహరించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయఎమ్మెల్సీ అభ్యర్థులు బుర్ర గోపీమూర్తి, గంథం నారాయణరావు, నామ వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగుదీపక్, అహ్మద్‌షేక్, డీఆర్‌వో వెంకట్రావు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా...

భీమేశ్వరస్వామి తెప్పోత్సవం

- భక్తుల శివనామస్మరణ మధ్య నిర్వహణ
- హంస వాహనంపై విహరించిన స్వామి, అమ్మవార్లు
- ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణ


భీమేశ్వరస్వామి ఆలయ కోనేరు పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కోనేరు పుష్కరిణిలో మంగళవారం రాత్రి భీమేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరి ఉత్సవమూర్తులు నయనానందకరంగా అలంకరించిన హంస వాహనంపై విహరించే కార్యక్రమాన్ని వందలాది భక్తుల శివ నామస్మరణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముందుగా ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, వినయ్ తదితరుల వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి, అమ్మవారి దేవతామూర్తులకు ప్రత్యేక శాంతికర పూజలను నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను అర్చకస్వాములు కోనేరు పుష్కరిణిలో విద్యుద్దీపాలంకరణలతోనూ, పూలతోనూ అలంకరించిన హంస వాహనంపై ప్రతిష్ఠించి తెప్పోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హంస వాహనంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, రైతుసంఘ అధ్యక్షులు కంటే జగదీష్‌మోహనరావు(బాబు), సీఐ శ్రీకృష్ణ భగవాన్, అర్చకస్వాములు ఆశీనులు కాగా కోనేరు పుష్కరిణిలో స్వామివారు, అమ్మవారు హంస వాహనంపై మూడు ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా కాల్పగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ తదితర భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



8నుంచి దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

- 14 వరకూ ప్రత్యేక పూజలు


పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులు

పిఠాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో డిసెంబరు 8 నుంచి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు జరగనున్నాయి. 14 వరకూ జరిగే ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దత్త జయంతి మహోత్సవాల తొలిరోజు 8వతేది నుంచి 14వరకూ ప్రతిరోజూ మహాగణపతిపూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మాలకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేద పారాయణ, ఋత్విక్కులతో మూలమంత్ర అనుష్టానం, గణపతి అథర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ, సాయంత్రం 4 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, 5గంటలకు శ్రీపాదశ్రీవల్లభుల దివ్యపాదపద్మాలకు వివిధ హారతులు, స్వామి వారికి పల్లకిసేవ, సాయంకాలార్చన, మంగళహారతి జరుగుతాయి. 8వతేదీ ఉదయం దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు సర్వపుష్పపూజ, 9న లక్షబిల్వార్చన, 10న సహస్ర చామంతి పూజ, 11న లక్షతులసి అర్చన, 12న సహస్ర లిల్లీ పుష్పపూజ, 13న గులాబి అర్చన, సంపెంగ పుష్పపూజ, 14న పూలంగిసేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. దత్తజయంతిరోజు సాయంత్రం దత్తాత్రేయ స్వామిరథోత్సవం నిర్వహిస్తారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మహాసంస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు.

అంతర కళాశాలల కబడ్డీలో జేఎన్టీయూకే జట్టుకు తృతీయస్థానం

జేఎన్టీయూకే, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16, 17 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలులోని రైస్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో నిర్వహించిన జేఎన్టీయూకే అంతర కళాశాలల కబడ్డీ మహిళల పోటీల్లో జేఎన్టీయూకే జట్టు తృతీయస్థానంలో నిలిచినట్లు స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో 20 కళాశాలల జట్లు పాల్గొన్నాయన్నారు. ప్రతిభ కనబరచి తృతీయస్థానంలో నిలిచిన జట్టు క్రీడాకారిణులను యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు, శ్యామ్‌కుమార్ అభినందించారు.


కబడ్డీ జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

బైక్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్రగాయాలు
- మండపేటలో ఘటన

మండపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణం కలవపువ్వుసెంటర్‌లో మంగళవారం తెల్లవారుజామున కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలివి. మండపేట పట్టణానికి చెందిన వసంత టైలర్స్ యజమాని కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్న సమయంలో అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టారు. దీంతో మండపేట పట్టణంలోని గాంధీనగరానికి చెందిన ఎం.పద్దయ్య, గొల్లపుంతకాలనీకి చెందిన రెడ్డి వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మండపేట ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై పట్టణ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మండపేటలో కారు ఢీకొట్టడంతో తిరగబడిపోయిన బైక్

40కిలోల గంజాయి స్వాధీనం

- మోతుగూడెంలో వేర్వేరు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న పోలీసులు

మోతుగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో వేర్వేరు తనిఖీల్లో 40కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీలేరునుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురిని మోతుగూడెం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా గోదిసేలపేటకు చెందిన మద్దెల హరీష్, అలక్క సందీప్, పైడిపల్లికి చెందిన పెరుమాండ్ల ప్రవీణ్, మల్లిపల్లికి చెందిన జుంబిడి విజయ్ సీలేరు నుంచి కరీంనగర్‌కు 30కిలోల గంజాయిని తీసుకెళ్తుండగా సమాచారం రావడంతో పోలీసులు పట్టుకున్నారు. దాని విలువ రూ.1.50లక్షలు ఉంటుంది. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. డొంకరాయి పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా డొం కరాయి ఎస్‌ఐ శివకుమార్ తన సిబ్బందితో డొంకరాయి అంబేడ్కర్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు గ్రామానికి చెందిన కన్నెబోయిన దుర్గాప్రసాద్, తులసిపాక గ్రామానికి చెందిన నమలం మల్లేష్, ఒడిశా రాష్ట్రం కలిమెల నుంచి పది కిలోల గంజాయిని ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్తుండగా అరెస్ట్ చేశారు.


గంజాయితో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

లారీల డ్రైవర్లకు మొబైల్ స్లిప్‌లు

- సీతానగరంలో హైవేపై రెండు కిలోమీటర్ల మేర నిలిచిన ఇసుక లారీలు


రహదారిపై నిలిచిపోయిన ఇసుక లారీలు


మొబైల్ స్లిప్‌లు పంపిణీ వాహనం వద్ద లారీ డ్రైవర్లు

సీతానగరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానంలో ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం శ్రీరామనగరం పెట్రోల్ బంక్ నుంచి రాష్ట్ర హైవేపై మంగళవారం రెండు కిలోమీటర్ల మేర ఇసుక లారీలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.ఇంతకీ అసలు దీనిపై ఏంటా అని ఆరా తీస్తే పెట్రోల్ బంక్ వద్ద మొబైల్ స్లిప్‌ల(కారులోనే స్లిప్‌ల పంపిణీ) కేంద్రం ఏర్పాటు చేశారు. లారీడ్రైవర్లు ఆ కారు వద్ద గుమిగూడి వాటిని తీసుకుంటున్నారు. దీంతో లారీలు అధిక సంఖ్యలో నిలిచిపోయాయి. ఇసుక ర్యాంపువద్ద చేయాల్సిన పని రోడ్డుపై లారీలను నిలిపి పనులు చేసుకోవడంపట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఇసుక రవాణా లేకపోవడం, తిరిగి మంగళవారం ప్రారంభం కావడంతో ఇసుక లారీలు భారీ సంఖ్యలో వస్తున్నాయి.

స్కేటింగ్ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు పాశర్లపూడి కుర్రోడు


మిత్ర ఆరుష్

మామిడికుదురు,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్కేటింగ్ ఫుట్‌బాల్ ప్రపంచకప్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామానికి చెందిన మార్లపూడి మిత్ర ఆరుష్ ఎంపికయ్యాడు. గతనెలలో హైదరాబాద్‌లో జరిగిన స్కేటింగ్ ఫుట్‌బాల్ పోటీల్లో ఆరుష్ ప్రతిభ కనబరిచి ప్రపంచకప్‌కు ఎంపికైనట్లు అతడి తండ్రి శ్రీనివాసరావు తెలిపాడు. ఫుట్‌బాల్‌స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి టర్కీలోని టర్బన్ నగరంలో ఈనెల 20 నుంచి 26 వరకు జరగనున్నట్టు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతోపాటు తన కుమారుడు కూడా ఈ పోటీల్లో పాల్గొనేందుకు టర్కీకి బయలుదేరినట్లు ఆయన తెలిపారు. తమ గ్రామస్థుడు ప్రపంచ పోటీలకు ఎంపికవ్వడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సొంతగూటికి చేరడం సంతోషం ఉంది: టీడీపీ నేత రాజీవ్‌కృష్ణ

రాజమహేంద్రవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరడం సంతోషంగా ఉందని, తన కుటుంబం రాజకీయ జీవితం ప్రారంభించిన సొంత గూటికి తిరిగి చేరానని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు ఎస్.రాజీవ్ కృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీవర్గాలు, అభిమానులకు, నేతలకు కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం సందేశాలు పంపారు. తన మామయ్య కృష్ణబాబు ఐదుసార్లు కొవ్వూరు ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. విజనరీ నేతలైన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నాయకత్వంలో చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు.

జగ్గంపేటలో 116 ఏళ్ల వృద్ధుడి మృతి


బూరా చిన్న అప్పారావు

జగ్గంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన శతాధిక వృద్ధుడు బూరాచిన్న అప్పారావు సోమవారం మృతి చెందాడు. జగ్గంపేటలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన ఆయన 116 సంవత్సరాలు జీవించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇందిరాగాంధీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంనుంచి ఈయన రాజకీయాల్లో పని చేస్తూ చివరి దశ వరకు ఆరోగ్యంగానే ఉన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి నడిచాడు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై కేసు

కాకినాడ క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన సంఘటన మంగళవారం కాకినాడలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడుకు చెందిన 17ఏళ్ల విద్యార్థిని అధికారి సత్యసాయి కరుణశ్రీ, కాకినాడ శాంతినగర్‌కు చెందిన 17ఏళ్ల విద్యార్థిని కటికలపూడి నాగశ్రీ కొత్త కాకినాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వారిద్దరూ మంగళవారం కళాశాలకు డుమ్మా కొట్టి ఎస్ఆర్ఎంటీ మాల్‌కు వెళ్లారు. అక్కడి నుంచి వేరేవాళ్ల ఫోన్‌లో ఇద్దరి ఇళ్లకు ఫోన్ చేసి తాము గుడికి వెళ్లి వస్తామని చెప్పి ఫోన్ పెట్టేశారు. అప్పటినుంచి విద్యార్థినులు ఇద్దరు ఇళ్లకు వెళ్లకపోయేసరికి ఇద్దరి తల్లిదండ్రులు కాకినాడ టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థినుల ఆచూకీ కోసం సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.99లక్షలు

ఆత్రేయపురం,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,99,009 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

లంచం వ్యవహారంలో రాజమండ్రి సీఐ దుర్గారావు సస్పెండ్

గుడివాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడివాడ టూటౌన్ సీఐగా పనిచేసిన కాలంలో లంచం వసూళ్ల కేసుల్లో ప్రస్తుత రాజమహేంద్రవరం సీఐ దుర్గారావును సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆదేశాలిచ్చారు. 2022లో భూవివాదంలో దుర్గారావుపై ఏసీబీని ఫిర్యాదుదారుడు ఆశ్రయించారు. రెండు వర్గాలకు సంబంధించి రూ.30లక్షల వివాదాన్ని పరిష్కరించే క్రమంలో దుర్గారావు కొన్ని డాక్యుమెంట్‌లను బలవంతంగా తీసుకుని వ్యతిరేక వర్గానికి ఇచ్చారు. సదరు డాక్యుమెంట్‌లను వెనక్కి ఇవ్వాలని ఫిర్యాదుదారుడు సీఐని కోరగా డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా దర్యాప్తులో నేరం రుజువు కావడంతో సీఐ దుర్గారావుపై క్రిమినల్ కేసును పెట్టి సస్పెండ్‌కు సిఫారసు చేస్తూ ఐజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

పదో తరగతి పరీక్ష ఫీజును 26 లోపు చెల్లించాలి

- కాకినాడ జిల్లా డీఈవో

కాకినాడ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్, ఒకసారి పరీక్షలకు హాజరై ఫెయిలైన విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 26 లోపు చెల్లించాలని కాకినాడజిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. నామినల్ రోల్స్ డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల27నుంచి డిసెంబరు 2లోపు,రూ.200 అపరాధ రుసుంతో డిసెంబరు 3వ తేదీ నుంచి 9వతేదీ లోపు, రూ.500 అపరాధ రుసుంతో 10వతేదీ నుంచి 16వతేదీ లోపు చెల్లించాలన్నారు. నామినల్ రోల్స్ తోపాటు పరీక్షఫీజును www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక

కాట్రేనికోన, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాల విద్యార్థి కొల్లు గౌతమ్‌ధర్మా అంతర్‌కళాశాలల చెస్ చాంపియన్‌షిప్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచాడు. డిసెంబర్ 4న చెన్నైలో జరిగే సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటాడని కళాశాల కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ తెలిపారు.

మహిళా దినోత్సవాలు

ఉప్పలగుప్తం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉప్పలగుప్తం, భీమనపల్లి గ్రంథాలయాల్లో మహిళా దినోత్సవాలు నిర్వహించారు. ఇందిరాగాంధి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషుకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి



అమలాపురంలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమలాపురం హైస్కూలు సెంటర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ అధికార ప్రతినిధి ముషిణి రామకృష్ణారావు, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, జిల్లా కార్యదర్శి నిమ్మకాయల ప్రసాద్, నాయకులు మహబూబ్ షకీల, దేవరపల్లి రాజేంద్రబాబు, రెడ్డి బాబు, సాధనాల చినసత్యనారాయణ, వస్కా బాబు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మంగళవారం ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నగరం బీఎస్ మూర్తి రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మండల శాఖ అధ్యక్షుడు అప్పన రామకృష్ణ, నీతిపూడి బాలసత్యనారాయణ, గెడ్డం వెంకటేశ్వరరావు, వాణరాశి దుర్గారావు, కొండేటి వెంకటేశ్వరరావు, మట్టా సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. స్థానిక ఇందిరాగాంధీ సర్కిల్, భీమ్‌నగర్ జాతీయ రహదారి ముఖద్వారం వద్ద గల ఆమె విగ్రహాలకు ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి, ప్రజాపనుల శాఖ ఈఈ, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిపాలెం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించినట్టు గ్రంథాలయ అధికారి వై.వెంకటలక్ష్మి తెలిపారు. కేశవదాసుపాలెం కాల్వమొగ సెంటర్‌లో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సరెళ్ల ప్రసన్నకుమార్, తోటే ప్రతాప్, అల్లూరి మధురాజు, గొల్ల లతీష్, కొల్లాబత్తుల భాస్కరరావు, తోటే సత్యానందం, చొప్పల మత్తయ్య, మత్తి జయబాబు, స్టూడియో వంశీ, వర్తకసంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సేవలో ఏపీఈఆర్సీ చైర్మన్

విద్యుత్ సమస్యలపై నాయకుల వినతి

అంతర్వేది, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్‌శాఖ (ఏపీఈఆర్సీ) చైర్మన్ టి.రాంసింగ్‌ఠాకూర్ విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితుల మహదాశీర్వచనం పొందారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి అందించారు.



విద్యుత్ సమస్యలపై రాష్ట్ర విద్యుత్‌శాఖ చైర్మన్ రాంసింగ్‌ఠాకూర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీ వీరా మల్లిబాబు

విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలన

సఖినేటిపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ (ఏపీఈఆర్సీ) చైర్మన్ టి.రాంసింగ్ ఠాకూర్ మంగళవారం పరిశీలించారు. తొలుత రాంసింగ్‌ఠాకూర్‌కు విద్యుత్ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం రికార్డుల పరిశీలన, సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సప్లయి పనితీరు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఈఆర్సీ మెంబర్ పి.వెంకట్రామిరెడ్డి, జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రాజబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్, బి.మల్లిక, వై.విజయానంద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ బొలిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వినతిపత్రం

సఖినేటిపల్లి మండలంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు విద్యుత్ సమస్యలపై విద్యుత్‌శాఖ రాష్ట్ర చైర్మన్ రాంసింగ్‌ఠాకూర్‌కు ఎంపీపీ వీరా మల్లిబాబు ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. విద్యుత్ సమస్యలపై తగు చర్యలు తీసుకుని వాటిని పరిష్కరించాలని కోరారు.

రైతులు రబీ సాగుకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న ఏడీఏ రామ్మోహనరావు

అంబాజీపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రబీ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని వచ్చే నెల 15వతేదీలోపు వరి నాట్లు పూర్తిచేసుకోవాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జ్వే రామ్మోహనరావు సూచించారు. రాష్ట్రీయక్రిషివికాస్ యోజన పథకంలో భాగంగా ఇరుసుమండలో రబీ ముందస్తు సాగుకు సమయాత్తంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఏవో సీహెచ్‌డీ విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి జె.మనోహర్ మాట్లాడుతూ కోతలు పూర్తన రైతులు నారుమడులు వేసుకోవాలన్నారు. వరి విత్తన ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచి అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను ఎంపిక చేసుకోవాలన్నారు. తెగుళ్ల తట్టుకునే విధంగా ఎంటీయూ 1121ఎంపిక చేసుకుని సాగు చేయాలని సూచించారు. విత్తన శుద్ధికి సూడోమోనస్ కిలో విత్తనాలకు 10గ్రాములకు లేదా కార్బండజమ్ 3 గ్రాములను కిలో విత్తనానికి కలిపి వేసుకోవాలన్నారు. నారుమడి వేసే సమయంలో రైతులు సస్యరక్షణపై చర్యలు తీసుకోవాలన్నారు. రబీలో అధికంగా ఎరువులు, పురుగులు వాడటం వల్ల పంటకు అనర్థం కలుగుతుందన్నారు. వ్యవసాయశాఖ సూచించిన విధంగా ఎరువులు, పురుగు మందులను వాడటం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఏఈవో డి.దుర్గారావు, వీఏఏ ఎస్.దుర్గ, రైతులు దంతులూరి సత్యనారాయణరావు, ఆకుల దొరబాబు, మోకాటి నాగేశ్వరరావు, కడలి సత్యనారాయణ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి: నలుగురు యువకులపై కేసు

మలికిపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎఫ్‌డీటీ జూనియర్ కళాశాల విద్యార్థి రామేశ్వరవరపు జయసాయి యువరాజును గాయపర్చిన కేసులో నలుగురి యువకులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. ఒక అమ్మాయి విష యంలో ఈనెల5న నలుగురు యువకులు యువరాజును మలికిపురం సత్యజ్యోతి థియేటర్ వెనుక ప్రాంతానికి తీసుకువెళ్లి దుర్భాష లాడి గాయపర్చారు. యవరాజు తల్లిదం డ్రు లకు, కళాశాల యాజమాన్యానికి ఈవిషయం తెలియకుండా నలుగురు యువకులు జాగ్రత్త పడ్డారు. అయితే ఘటనపై వీడియో తీసిన స్థానికులు సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. దీంతో ఈవిషయం తెలుసుకున్న యువరాజు తండ్రి మలికిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నలుగురి యువకులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

శ్రీలక్ష్మీనారాయణస్వామి వార్షిక కల్యాణం

అమలాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నల్లమిల్లి శ్రీకృష్ణదేవరాయ వీధిలో మంగళవారం శ్రీలక్ష్మీనారాయణస్వామి 14వ వార్షిక కల్యాణాన్ని యువసేన ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం అనంతరం స్వామి-అమ్మవార్లను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకూరి సాయిరామ్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, జనసేన నాయకులు కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు, కల్వకొలను తాతాజీ, యేడిద శ్రీను, సర్పంచ్ గోకరకొండ వాసు, నల్లా వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి దర్శించుకున్నారు. నల్లమిల్లి యువసేన ఆధ్వర్యంలో కులాలకు అతీతంగా కార్తీక వనసమారాధన నిర్వహించారు.

బెల్టుషాపులపై దాడులు

రాజోలు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులపై దాడులు నిర్వహించి మలికిపురం మండలం గుడిమెళ్లంకలో తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం పరుచుకుని ఒకర్ని అరెస్టుచేసినట్టు సీఐ కె.వీరబాబు తెలిపారు.

వీరేశ్వరాలయంలో రుద్రహోమం



రుద్ర హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఐ.పోలవరం, నవంబరు 19ఆంధ్రజ్యోతి): మురమళ్ల భద్రకాళీసమేత వీరేశ్వరాలయంలో మంగళవారం రుద్రహోమం వైభవంగా నిర్వహించారు. పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమ పూజలు జరిగాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లను సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. దంపతులు సామూహికంగా వేదపండితుడు సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కాశ్యకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి,సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. గంగుమళ్ళ వీరభద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో 2000మంది పాల్గొన్నారు. త్సవటపల్లి నాగు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ళ భాను, పీఎస్ఎన్ రాజు, అక్కల నాగముండేశ్వరరావు, గంగుమళ్ళ కిరణ్, మోటిపల్లి శ్రీను, సలాది సతీష్, చిక్కం ఆనందకుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ శంకర్, బాలచంద్రరావుపాల్గొన్నారు.

కుండలేశ్వరంలో పూజలు

కాట్రేనికోన, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు కుండలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమి నదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. మండపేటకు చెందిన 15మంది

ఉమామల్లేశ్వరునికి లక్షబిల్వార్చన

అల్లవరం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అల్లవరం ఉమామల్లేశ్వరునికి ఉపద్రష్ట విక్రమాదిత్య బ్రహ్మత్వంలో చంద్రమౌళి కృష్ణమూర్తి పర్యవేక్షణలో లక్ష బిల్వార్చన, మహాలింగార్చన, శాంతి కల్యాణం, సూర్యనమస్కార పూజలు జరిగాయి.

సంకటహర చతుర్థి పూజలు



శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి సంకటహర చతుర్థిని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. మంగళవారం స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సంకటహర చతుర్థి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్నారు. అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

లక్ష బిల్వార్చన

మామిడికుదురు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మామిడికుదురులోని పార్వతీ రామలింగేశ్వరస్వామికి స్థానిక భక్త దంపతులు నయినాల తమ్మారావు దంపతుల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్త దంపతులు కర్తలుగా పాల్గొని రామలింగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, మహారుద్రాభిషేకం, పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం నయినాల తమ్మారావు స్వగృహం వద్ద జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాశర్లపూడి బాడవలోని శివాలయం వద్ద కార్తీకమాసాన్ని పురస్కరించుకుని లక్ష బిల్వార్చన, అన్నసమారాధన జరిగింది.

వైభవంగా లక్ష బిల్వార్చన

ఉప్పలగుప్తం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి శ్రీమాణిక్యాంబ సహిత భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన జరిగింది. భైరవబొట్ల వెంకటసుబ్రహ్మణ్యశర్మ (నాని) కార్తికేయశర్మ పర్యవేక్షణలో పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి గౌరీశంకర్ బ్రహ్మత్వంలో పూజలు జరిగాయి. ఉదయం జరిగిన కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలుపాల్గొన్నారు. కొప్పిశెట్టి శ్రీనివాసరావు ధనసహాయంతో అన్నసమారాధన జరిగింది. ఎస్.యానాంలో ఉమారాజేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన జరిగింది.

శంఖాలతో మహాలింగార్చన



ఉప్పలగుప్తం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విలసవిల్లిలో మహాలింగార్చన 18వ రోజున విశేష పూజలు నిర్వహించారు. మునగంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో 128 శంఖాలతో లింగార్చన జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మహాలింగార్చనలో పాల్గొని పూజలు చేశారు.

ఓఎన్జీసీ పరిహారం నిధులు విడుదల

● సీఎంతో సమీక్షా సమావేశం



సీఎంతో చర్చిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ఓఎన్జీసీ నుంచి రావాల్సిన మొత్తం నష్టపరిహారం పూర్తిగా విడుదలైందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. పుదుచ్చేరిలో ఉన్న మల్లాడి మీడియాతో మాట్లాడారు. సీఎం రంగసామి నేతృత్వంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారని మల్లాడి చెప్పారు. ముఖ్యంగా యానాంలో పెండింగ్‌లో ఉన్న 231మంది మత్స్యకారులకు నష్ట పరిహారం రూ.6.37కోట్లు ఓఎన్జీసీ సంస్థ ప్రభుత్వ ఖాతాకు జమచేసిందని మల్లాడి వివరించారు. చివరి అయిదున్నర నెలలకు సంబంధించి మొత్తం 5,520మంది(5258+231) మత్స్యకారులకు నష్ట పరిహారం 34.91కోట్లు ఓఎన్జీసీ ప్రభుత్వ ఖాతాలో జమచేసిందన్నారు. ఈసందర్భంగా సీఎం రంగసామితో పరిహారానికి సంబంధించి ప్రభుత్వం ఇవ్వలసిన ఎక్స్‌పెండిచర్ అనుమతి ఇవ్వాలని కోరిన నేపథ్యంలో బుధవారం సీఎం చాంబర్‌లో ఫైనాన్స్, మత్స్యశాఖ కార్యదర్శి, డైరెక్టర్లతో సీఎం సమావేశం నిర్వహించారన్నారు. పుదుచ్చేరి గవర్నర్, సీఎంలతో సమావేశమై త్వరలో జరిగే యానాం పర్యటనకు సంబంధించి తేదీలు ఖరారు చేయడం జరిగిందన్నారు. మత్స్యకారులకు అతిత్వరలోనే పరిహారం పెండింగ్‌తో కలిపి మొత్తం రూ.96కోట్లు అర్హులైన మత్స్యకారులకు ఇస్తామన్నారు. పరిహారం విడుదలపై ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్ సునీల్ కుమార్, అధికారులకు యానాం మత్స్యకారుల తరుపున మల్లాడి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నాయకుడికి సతీవియోగం

ముమ్మిడివరం,నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఠాణేలంక మొల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ జగతా జానకిరామయ్య సతీమణి వీరవెంకటసత్యనారాయణమ్మ(80) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె భౌతికకాయాన్ని నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

ముమ్మిడివరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మెప్మా రిసోర్స్‌పర్సన్లకు నిర్వహించిన సదస్సులో కమిషనర్ మాట్లాడారు. కార్యక్రమంలో సిటీమిషన్ మేనేజర్ సోమాని భాస్కర్, కోఆర్డినేటర్ రాజేశ్వరి, బ్యాంకర్లు, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

అయినవిల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మహిళా సాధికారతపై చర్చ నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి ఎస్.జయషీల, మహిళలు, విద్యార్థులు మహిళలు పాల్గొన్నారు.

శివయ్య పెళ్లికొడుకాయెనే..



బండారులంకలో శివపార్వతులకు మంగళ స్నానం చేయిస్తున్న శంకరమూర్తి దంపతులు

అమలాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శివపార్వతులను లక్కింశెట్టి నాగమల్లేశ్వరరావు దంపతులు, పిచ్చిక వెంకన్న దంపతులు పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది దంపతులకు గ్రామోత్సవం నిర్వహించారు. దైవపు కోటేశ్వరరావు దంపతులు అమ్మవారికి సారె సమర్పించారు. ముత్తయిదువులకు కాళ్లకు పారాణి రాసి, గాజులు వేసి శనగలు పంపిణీ చేశారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి-చంద్రకళ దంపతులు స్వామి-అమ్మవార్లకు మంగళస్నానం చేయించారు.

కార్తీక వనసమారాధనలు

అమలాపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని అమలాపురం మోబర్లీపేటలోని కర్రి సత్యనారాయణ ప్రాంగణంలో గాయత్రీ సహిత వారాహి హోమం నిర్వహించారు. ఆమ్లక వృక్షం వద్ద శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక వన సమారాధన నిర్వహించారు. శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో కర్రి వెంకట సత్యఅమ్మాజీ, కర్రి శ్రీహర్ష, అఖిల, అదవితముఖి, పోతురాజు నాగకనకదుర్గ, కుమారి తదితరులు పాల్గొన్నారు. చిందాడగరువులో నిర్వహించిన కార్తీక వనసమారాధనలో డాక్టర్ కొప్పుల నాగమానస, మోటూరి కనకదుర్గ-వెంకటేశ్వరరావు, ముత్యాల మణి, బీజేపీ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, కొండేటి ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెర్బల్ గార్డెన్ ప్రారంభం

అమలాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ సముదాయ సమావేశాన్ని ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హెర్బల్ ప్లాంట్స్ గార్డెన్‌ను డీవైఈవో ప్రారంభించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ఏర్పాటుచేసిన బొమ్మలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.నాగసత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి బద్రి శ్రీనివాస్, శ్రీప్రకాష్, స్వాతి, బి.సత్యనారాయణ, ఎస్.రాజేశ్వరిపాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీరాణి జయంతి

అమలాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎస్కేబీఆర్ బీఈడీ కళాశాలలో ఝాన్సీరాణి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.అంజనీశ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఝాన్సీరాణి జీవితం నేటితరం విద్యార్థినులు, మహిళలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె తెగువ, సాహసం అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గణిత అధ్యాపకుడు బండారు రామ్మోహనరావు, అధ్యాపకులు డి.సూర్యప్రకాశరావు, మాచిరాజు నాగేశ్వరరావు, ప్రశాంతి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అయినవిల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో నల్లచెరువు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం కార్తీక వనసామారాధన నిర్వహించారు. తొలుత ఉసిరిచెట్టు వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ అధ్యక్షునిగా యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శిగా నూలు సూర్యప్రభాకరరావు, కోశాధికారిగా శ్రీకాకొళపు రాంపండు, ఉపాధ్యక్షులుగా అప్పన హరిశివప్రసాద్, నంబూరి శ్రీనివాస్, గ్రంధి గుప్తలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇటీవల రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించబడ్డ కంకటాల రాంబాబును ఘనంగా సత్కరించారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

పి.గన్నవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టాలను రూపొందించిందని ఎస్ఐ బి.శివకృష్ణ అన్నారు. పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాలలో చట్టాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ ర్యాలీ

అల్లవరం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా అల్లవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి శాంతిలక్ష్మి, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ పాల్గొన్నారు. పంచాయతీ నుంచి సడక్ స్కూల్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. విద్యార్థులకు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈవోపీ ఆర్డీ యు.నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు

అల్లవరం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై, కుటుంబ సభ్యులపై అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన నాయకులు అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫొటో మార్ఫింగ్‌ల ద్వారా అనుచితంగా వ్యవహరించకుండా చర్యలుతీసుకోవాలన్నారు. ముత్యాల బాబి, కంకిపాటి వీరబాబు, రొక్కాల నాగేశ్వరరావు, చిట్నీడి శ్రీని వాస్, కంకిపాటి గోపి, నల్లా రాము, బొర్రా రాజేష్, చాట్ల మంగతాయారు, అరుణ్, యాళ్ల బిందాస్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

విద్యార్థులతో సీఎంవో సుబ్రహ్మణ్యం ముఖాముఖి

అంతర్వేది, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిపాలెం మధ్యగ్రూపు పాఠశాలలో విద్యార్థులతో సీఎంవో ముఖాముఖి నిర్వహించారు. ఉపాధ్యాయుల సూచనలు అనుసరించి ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. రాజోలు నియోజకవర్గస్థాయి, మండలస్థాయి, ప్రైమరీ స్కూలు, హైస్కూలు కాంప్లెక్సు మీటింగ్ నిర్వహణను గొంది, అంతర్వేదిపాలెం హైస్కూలులో తెలుగు సబ్జెక్టు కాంప్లెక్సు, మోరి హైస్కూలు బయాలజీ సబ్జెక్టు కాంప్లెక్సు సమావేశాలు నిర్వహించారు. ప్రత్యేకాధికారిగా బి.సుబ్రహ్మణ్యం విద్యార్థులతో మాట్లాడి ముఖాముఖి నిర్వహించి అన్ని సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాల పెంపు, టీఎల్ఎం గురించి మాట్లాడారు. ఎంఈవోలు డి.కిశోర్‌బాబు, ఎం.వెంకటేశ్వరరావు, రిసోర్సుపర్సన్ జి.ప్రభావతి, కె.సంపత్‌కుమారన్, బాలకృష్ణ, వర్మ, సత్తిపండు, గెజిటెడ్ హెచ్ఎం ఎస్.సత్యనారాయణ, కనకలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆ వ్యాఖ్యలు మాజీ ఎమ్మెల్యే రాపాక వెనక్కి తీసుకోవాలి

అంతర్వేది, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అంతర్వేది గొంది గ్రామంలో అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు మంగళవారం సమావేశమయ్యారు. ఇటీవల ఒక సామాజిక వర్గం నిర్వహించిన కార్తీక వనభోజనాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో కేశవదాసు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయిస్తున్నట్టు చెప్పడం తగదని అగ్నికుల క్షత్రియుల సంఘం సభ్యులు తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ చరిత్రను గుర్తుచేసుకుంటూ ఆలయ ప్రాంగణంలో ఎటువంటి విగ్రహాలు నిర్మించడానికి వీలు లేదని కొల్లు మహాలక్ష్మి అన్నారు. ఆలయంలో ఎటువంటి వివాదాలు సృష్టించకుండా కులాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని అగ్నికుల క్షత్రియుల సంఘం డిమాండు చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని కొల్లు మహాలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో తిరుమాని ఆచార్యులు, పోతాబత్తుల రాంబాబు, కొల్లు రాము, కొల్లు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాజోలు గురుకుల బాలికల ప్రతిభ

రాజోలు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజోలు గురుకుల బాలికల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థినులు జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో పశ్చిమ గోదావరి జిల్లా కొలసానిపల్లెలో ఇటీవల జరిగిన అథ్లెటిక్స్‌లో నలుగురు విద్యార్థినులు ప్రతిభ చూపి మూడో స్థానం సాధించారని మంగళవారం ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. బాలికలను ప్రిన్సిపాల్ లలితకుమారి, వైస్ ప్రిన్సిపాల్ వి.అనితకుమారి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పీఈటీ, పీడీ అభినందించారు.

మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా చెల్లి అశోక్



ముమ్మిడివరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచా యతీ రాజుపాలేనికి చెందిన చెల్లి అశోక్ మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1998నుంచి ఆయన టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు. ఆయన సతీమణి శాంతకుమారి ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా 2014-19లో పనిచేశారు. అశోక్ మాలమహానాడులో పలు కీలక పదవులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆయనను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలుచేయాలి

రాజోలు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ప్రైవేటు కార్పొరేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని దళిత చైతన్య వేదిక నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాజోలులో దళిత చైతన్యవేదిక ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటు కార్పొరేట్ సంస్థలుగా మారుతున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ప్రైవేటు కార్పొరేట్ సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం, ప్రధాని, పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలకు లేఖలు రాయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, బత్తుల జనార్థనరావు, మట్టా సురేష్, జిల్లెల్ల వినోద్‌బాబు, బొడ్డపల్లి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముమ్మిడివరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా, ఇద్దరు గాయపడ్డారు. గొల్లలమామిడాడకు చెందిన కోత మిషన్ ఆపరేటర్లగా పనిచేస్తున్న యు.అనుకుమార్, యు.అభిషేక్, ఎ.సురేష్‌లు మంగళవారం తెల్లవారుజామున మచిలీపట్నం నుంచి గొల్లలమామిడాడకు మోటారుసైకిల్‌పై వెళ్తున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ నడిమిలంక సమీపంలో మోటారుసైకిల్ అదుపుతప్పి పడిపోయారు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అనుకుమార్(23) అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. యు.అభిషేక్, ఎ.సురేష్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ బి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

అడవి పంది వేటపై అటవీ శాఖ దర్యాప్తు

అల్లవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు సముద్ర తీరంలో సోమవారం రాత్రి అడవి పందిని వేటాడి వధించిన సంఘటనపై అటవీ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. అటవీ శాఖ డీఆర్‌వో, సిబ్బంది బుధవారం ఓడలరేవులో పర్యటించారు. కొమరగిరిపట్నం, ఓడలరేవు తీర గ్రామాల్లో రాత్రి సమయాల్లో అడవి పందుల వేట సాగుతున్నట్లు దీనిపై బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. ఓడలరేవు టెర్మినల్ తీరాన వేటాడి వలలో అడవిపందిని బంధించి వధించిన వ్యక్తులపై ఆరా తీస్తున్నారు. వైనతేయ వరదకు కొట్టుకువచ్చిన పందులు మందలుగా పెరిగాయని వన్యప్రాణి చట్టం ప్రకారం పందుల వేట నిషేధమన్నారు. ఓడలరేవులో అడవిపందుల వేటపై దర్యాప్తు ముమ్మరం చేస్తున్నామన్నారు.

పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ శివదత్ పూజలు

అంతర్వేది, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పౌర సరఫరాల రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా రవిరాజు పోటీ



పి.గన్నవరం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తానని వైసీపీ ఉమ్మడి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మంతెన రవిరాజు తెలిపారు. గంటిపెదపూడిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గంటి పెదపూడి నుంచి రవిరాజు బంధువు మంతెన వెంకటసుబ్బరాజు కొత్తపేట నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ఎన్నికై సేవలందించారని గుర్తు చేశారు. సుబ్బరాజు చేసిన సేవలకు అనుగుణంగా సేవలందిస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ పోటీకి దూరంగా ఉంటామని వైసీపీ ప్రకటించిన నేపథ్యంలో రవిరాజు పోటీపై పార్టీ ఏ చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి

ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ శిక్షణా తరగతులు

రాజోలు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు, సబ్జెక్టు ఉపాధ్యాయులకు, ఫిజికల్ డైరెక్టర్లకు కాంప్లెక్సు శిక్షణా తరగతులు రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. శివకోటి, రాజోలు, తాటిపాక కాంప్లెక్సుల్లో ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు రాజోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కడలి, పొన్నమండ కాంప్లెక్సు ఉపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు కడలి జిల్లాప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణా తరగతులకు హాజరయ్యారన్నారు. శిక్షణా తరగతులను సీఎంవో సుబ్రహ్మణ్యం పరిశీలించారు. కార్యక్రమంలో రాజోలు ఎంఈవో ఎస్.మనోహరం, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మిద్దె ఆదినారాయణ



కొత్తపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తపేటకు చెందిన మిద్దె ఆదినారాయణ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు.. ఆయనను పలువురు అభినందించారు.

గోతులమయంగా కేశవరం-ద్వారపూడి రోడ్డు

● మరమ్మతులకు నోచుకోని కెనాల్ రోడ్డు ● పట్టించుకోని అధికారులు



కేశవరం-ద్వారపూడి మధ్య గోతులమయంగా మారిన వేమగిరి-సామర్లకోట కెనాల్‌రోడ్డు

మండపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మూడు జిల్లాలను కలిపే వేమగిరి కాకినాడ కెనాల్‌రోడ్డుకు అటు కడియం పక్క, ఇటు అనపర్తివైపు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేస్తుండగా కోనసీమజిల్లా మండపేట మండలానికి సంబంధించిన కెనాల్‌రోడ్డు కేశ వరం ద్వారపూడి మధ్యవున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారినప్పటికీ మరమ్మతులు చేయకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్వారపూడిలో ఆంధ్రశబరిమలై అయ్యప్పస్వామివారి ఆలయం ఉంది. ఇక్కడకు కార్తీకమాసంలో భక్తులు అధికంగా వస్తుంటారు. కెనాల్‌రోడ్డు గోతులుమయంగా తయారవ్వడంతో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేశవరం జెడ్.మేడపాడు. రోడ్డుకూడా గోతులు ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికే పక్కజిల్లాలో రహదారులను భవనాలుశాఖధికారులు మరమ్మతులు చేస్తుంటే ఇక్కడ మాత్రం మరమ్మతులు చేయకపోవటంలో ఆంతర్యమే మిటని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తక్షణమే మూడు గ్రామాలమధ్యవున్న కెనాల్‌రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలికల రక్షణ చట్టాలపై అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అశోక్

ఆలమూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి బాలికలు తమకు చట్టం కల్పించిన రక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఆలమూరు ఎస్‌ఐ అశోక్ పేర్కొన్నారు. ప్రధానంగా విద్యార్థినులతోపాటు మహిళలు సైతం మహిళా రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా సంరక్షణ సభ నిర్వహించారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వెంటనే ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. సామాజిక మాధ్యమాలను వినియోగించే సమయంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రజాప్రతినిధులకు అధికారులు సమాచారం ఇవ్వాలి

రావులపాలెం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల సమయాలలో ప్రోటోకాల్ పాటిస్తూ స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులు ముందస్తు సమాచారం అందించాలని ఎంపీపీ కర్రి వెంకటలక్ష్మినాగదేవి అన్నారు. రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఎంపీడీవో మహేశ్వరరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధిపై అధికారులు వివరించారు. పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలపై ప్రశ్నించారు. జడ్పీటీసీ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ వచ్చాక బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. రావులపాలెం మండలంలో ఉబలంక, గోపాలపురం ఇసుక ర్యాంపులలో అక్రమాలు జరుగుతున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దారుకు సూచించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రారంభోత్సవాలు,

రావులపాలెం మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కర్రి వెంకటలక్ష్మినాగదేవి

శంకుస్థాపనలు, సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు సమయాలలో స్థానిక ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించి ప్రోటోకాల్ పాటించాలన్నారు. గ్రామాల్లో డెంగ్యూ జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజారోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అసెంబ్లీలో ఉంటే మండల సమావేశమా..!

నియోజకవర్గ సంక్షేమమం, అభివృద్ధి కోసం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అసెంబ్లీ సమావేశంలో చర్చిస్తుంటే ఎమ్మెల్యే లేకుండా రావులపాలెం మండల పరిషత్ సమావేశం నిర్వహించడం ఏమిటని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, జిల్లా టీడీపీ అధికారప్రతినిధి ముత్యాల బాబ్జి, కొత్తపేట నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పల్లి ఏసు ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ సమావేశాలు నిర్వహిస్తున్న సమయాలలో ఎమ్మెల్యే సత్యానందరావు నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతారన్నారు. లొల్లలాకుల ఆధునీకరణ, గ్రోయిన్స్ నిర్మాణం, టూరిజం అభివృద్ధితోపాటు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తామన్నారు. ఒక పక్క అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలను ప్రస్తావిస్తుంటే ఆయన లేని సమయంలో రావులపాలెం మండల సమావేశం ఏర్పాటు చేయడం ఏమిటని వైసీపీ సభ్యులకు ప్రజాసమస్యలుకన్నా వ్యక్తిగత సమస్యలు ప్రభుత్వంపై బురదజల్లడమే కార్యక్రమంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ఉందన్నారు.

వానపల్లి పల్లాలమ్మ ఆలయ పార్క్ నిర్మాణానికి చర్యలు

● కలెక్టర్ మహేష్‌కుమార్

కొత్తపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు వానపల్లి గ్రామసభకు విచ్చేసి ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా యుద్ధప్రాతిపదికన వానపల్లి పల్లాలమ్మ ఆలయంవద్ద పార్క్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఈమేరకు మంగళవారం పల్లాలమ్మ అమ్మవారి ఆలయాన్ని పరిశీలించి ఆలయ స్థలం ఎంతమేర ఉందో మ్యాప్‌లను పరిశీలించారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే దిశగా అధికారులు దృష్టిపెట్టాలన్నారు. అలాగే పార్క్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దారు వై.రాంబాబు, దేవస్థానం ఈవో బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పల్లాలమ్మ ఆలయ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కోటిపల్లి, యండగండి శివాలయాల్లో లక్షపత్రి పూజ



కోటిపల్లి ఛాయాసోమేశ్వరస్వామికి లక్షపత్రి పూజ దృశ్యం



వెంటూరు సోమేశ్వరస్వామికి నిర్వహిస్తున్న రుద్రాభిషేకం



మండపేట పట్టణంలో బసవేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



కపిలేశ్వరపురంలో చేస్తున్న గణపతి హోమం, పసలపూడిలో పార్థివ శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

కె.గంగవరం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిపల్లి శ్రీ ఛాయాసోమే శ్వరస్వామి, యండగండి గ్రామంలోని రాజరాజేశ్వరి సమేతసోమేశ్వరస్వామి వారి ఆలయల్లో మంగళవారం లక్షపత్రి పూజచేశారు. స్వామివారి జన్మనక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్ర సమయంలో స్వామివారికి లక్షబిళ్వార్చన చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. యండగండి శివాలయంలో ఆలయ అర్చకులు కొత్తలంక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండితులు వంక రామకృష్ణ బ్రహ్మత్వంలో రుత్వికులు శాస్త్రోక్తంగా లక్షబిల్వార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

రాయవరం: అష్టసోమేశ్వర ఆలయాల్లో ఒకటిగా పేరుగాంచిన మండలంలోని వెంటూరు శ్రీపార్వతి సోమేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం, ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని కొండేపూడి వెంకట సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగినకార్యక్రమంలో సోమేశ్వరస్వామికి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. ఈకార్యక్రమంలో దువ్వూరి రామారావు, తటవర్తి రాఘవరాజు, వింజమూరు సుబ్రహ్మణ్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పసలపూడిలో 108 పార్థివ శివలింగాల పూజలు

భక్తుల శివనామస్మరణల మధ్య మండలంలోని పసలపూడి గ్రామంలో శ్రీమాణిక్యాంబ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం 108 పార్థివ శివలింగాల పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం పరమశివుడు జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చింతా సుబ్బారెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు పరిటాల శ్రీనివాస్, పరిటాల కేదార్, మాధవభట్ల కృష్ణమూర్తి అర్చకత్వంలో సాంబమూర్తి గురుస్వామి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వినాయక పూజ, పుణ్యాహవచనం, 108 పార్థివలింగాలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈసందర్భంగా పార్థివ లింగాలకు మహన్యాస పూర్వక సహస్రనామాలతో లక్ష చామంతి పూజ చేశారు. అనంతరం పార్థివలింగాలకు గ్రామోత్సవం నిర్వహించి జలని మజ్జనం చేశారు. అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయం త్రం రాజరాజేశ్వర స్వామికి శాంతికల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పసలపూడి పరిసర ప్రాంతాలకు చెందిన శివస్వాములు, అయ్యప్ప మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

కపిలేశ్వరపురం : మండలకేంద్రమైన కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలో ఉన్న శ్రీఅగస్తేశ్వర, పాపవినాశేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో గణపతిహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగర గ్రామానికి చెందిన కె.కె. రాజు దంపతులచే పండితులు వై.కిరణ్ శర్మ ఆధ్వర్యం లో పలువురు రుత్వికులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు, గణపతి హోమం, తదితర పూజా కార్యక్రమాలను వేద మంత్రోశ్చరణల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు.

సంఘమేశ్వరస్వామివారికి లక్ష రుద్రాక్షల పూజ

మండపేట: పవిత్ర కార్తీకమాసంను పురష్కరించుకుని మండలంలోని ఏడిద సంఘమేశ్వర స్వామివారికి మంగళవారం లక్ష రుద్రాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు అయినవిల్లి సూర్యనారాయణ శర్మ సారథ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

● మండపేట పట్టణంలోని పాటిమీద ఉన్న శ్రీబసవేశ్వరస్వామి వారి ఆలయ 17వ వార్షికోత్సవం,కార్తీకమాసం సందర్భంగా మంగళవారం స్వామివారి కల్యాణంను నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వామివారికి వేదపండితులు మంత్రాల నడుమ కళ్యాణ వేడుకలను నిర్వహించి గోపూజ చేశారు. ప్రత్యేక అభిషేకాలు హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

లక్ష బిల్వార్చన

ఆలమూరు: మోదుకూరు శ్రీపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన జరిగింది

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులందరూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష ఏఎంవో పిల్లి రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పసలపూడిలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో అనుసరించాల్సిన బోధనా పద్ధతులు, బోధనోపకరణాలను తయారుచేసి ప్రదర్శించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మరింత మెరుగైన బోధన చేసేందుకు ఈ సమావేశాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు డీఆర్పీలు శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పసలపూడి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్.ఆదినారాయణ, చెల్లూరు రాయవరం గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ పాల్గొన్నారు.



రాయవరంలో మాట్లాడుతున్న రాంబాబు

అపార్ సంఖ్య నమోదు త్వరితగతిన పూర్తిచేయాలి

కె.గంగవరం: పాఠశాల విద్యార్థుల అపార్ సంఖ్యనమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కె.గంగవరంలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అపార్ నమోదుకోసం పాఠశాల ల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వాటిని ఉపయోగించుకునే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానో పాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో అక్రమాలపై మంత్రికి ఫిర్యాదు

మండపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం జెడ్.మేడపాడులో ఉన్న రెండు రేషన్‌దుకాణాల్లో నవంబరు నెలలో రేషన్ దుకాణం ద్వారా అందించాల్సిన కందిపప్పు పంచదారను డీలర్లు రేషన్‌కార్డుదారులకు ఇవ్వకుండా నొక్కేశారని గ్రామానికి చెందిన జాతీయ బీసీ సంఘ కార్యదర్శి తిగిరెడ్డి మహేశ్వరరావు ఆరోపించారు. గ్రామంలో జరిగిన రేషన్‌లో అవకతవకలపై విచారణచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఈమేరకు ఫిర్యాదు ప్రతులను ఆయన మంగళవారం స్థానిక విలేఖరులకు అందజేశారు.

'వడ్రంగి కార్మికుల ఉపాధిని కాపాడాలి'

రామచంద్ర పురం(ద్రాక్షారామ),నవంబరు(ఆంధ్రజ్యోతి):వడ్రంగి కార్మికుల ఉపాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రామచంద్రపురంలో కార్పెంటర్స్ అసోసియేషన్ వనసమారాధన జరిగింది. కార్పెంటర్స్ అసోసియేషన్ ప్రతీఏటా కార్తీక వనసమారాధన నిర్వహించడం సంప్రదాయంగా వస్తుందన్నారు. రెడీమేడ్ గుమ్మాలతో తలుపులు, కిటికీల కారణంగా వడ్రంగి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. కార్పెంటర్ కార్మికులకు 50 ఏళ్లకే పింఛను అందజేయాలని, భవన నిర్మాణాలు సమకూర్చాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి, యూనియన్ నాయకులు గానాల సత్యసాయి, రామోజీ శ్రీనివాస్, ధర్మాసనం రామకృష్ణ, వాసంశెట్టి రాంప్రసాద్, అంగర జగదీష్, దంగేటి రామకృష్ణ, గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, వాసంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

డిజిటల్ మనీ సర్క్యులేషన్‌పై అవగాహన పెంచుకోవాలి

రామచంద్ర పురం(ద్రాక్షారామ),నవంబరు19(ఆంధ్రజ్యోతి): డిజిటల్ మనీ సర్క్యులేషన్ పోన్‌పే, గూగుల్ పే, పేటీఎంలపై అవగాహన పెంచుకోవాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజీవ్‌కుమార్ కోరారు. మంగళవారం మెప్మా భవనంలో స్వానిధిబి, స్వయం సమృద్ధిబి అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేబీపై పథకాలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో మెప్మాటీఎల్ అనంతలక్ష్మి, సీవోలు, ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, మెప్మా సిబ్బంది, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

పురుషుల త్యాగానికి గుర్తింపు ఉండాలి: డాక్టర్ క్రాంతికుమార్

ద్రాక్షారామ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పురుషుల త్యాగానికి గుర్తుగా నవంబరు 19న పురుషుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని దంత వైద్యుడు డా. బి.క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం ద్రాక్షారామ భీమేశ్వర దంత వైద్యశాలలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డా. క్రాంతికుమార్ మాట్లాడుతూ పురుషుల హక్కులు, ఆరోగ్యం, సానుకూల అభిప్రాయాలు, లింగసమానత్వం సాధించడమే పురుషుల దినోత్సవ ముఖ్యకారణమన్నారు. పురుషుల దినోత్సవానికి ఐక్యరాజ్యసమితి ఆమోదం ఉందన్నారు. ఎక్కడచూసినా మహిళా సాధికారత, అభివృద్ధి గురించే మాట్లాడుతుంటారన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇరువైపులా వాదన వినకుండా తప్పు పురుషులపై ఎక్కువగా మోపుతున్నారన్నారు. మహిళా కమీషన్ మాదిరిగా పురుషులకు కమీషన్ ఏర్పాటు చేయాలని గతంలో ఢిల్లీలో పురుషుల హక్కుల సాధనసంస్థ సేవ్ ఇండియన్ ఫ్యామిలీ ప్రదర్శన జరిపిందన్నారు. పురుష రోగులకు దంతవైద్యంలో ఒక్కరోజు రాయితీ కల్పించినట్లు తెలిపారు.

'పోస్టల్‌శాఖ ఎన్‌పీసీఐ లింక్ ఖాతాలు తెరుచుకోవాలి'

మండపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలద్వారా లబ్ధిపొందే ప్రతిఒక్క లబ్ధిదారుడు మండపేట పోస్టల్‌శాఖ ద్వారా రూ.200 చెల్లించి ఎన్‌పీసీఐ ఖాతాను తెరుచుకోవాలని పోస్టుమాస్టర్ శ్రీనివాసరెడ్డి కోరారు. పట్టణంలోని 20వవార్డు గొల్లపుంతకాలనీలో మంగళవారం పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ఎన్‌పీసీఎల్ ఖాతాలు తెరిచే శిబిరంను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం గ్యాస్ సబ్సిడీ, మహిళలకు ఆర్థిక సాయం, రైతు భరోసా ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు లావాదేవీలన్నీ ఈ ఖాతాలో జమవుతాయన్నారు. కేవలం రూ.200తో ఈ ఖాతాను తెరుచుకునే అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు కొండపల్లి సూర్యనారాయణ, పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

104 వాహనాలు ప్రభుత్వమే నిర్వహించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సిబ్బంది ఎంపీపీ అంబటి భవానీకి వినతి పత్రం అందజేశారు. 104 వాహనాలు ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని, 104సిబ్బందికి అరబిందో ద్వారా రావాల్సిన ఈపీఎఫ్, ఈఎస్‌ఐ, ఇంక్రిమెంట్లు ఇప్పించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, పైలట్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు



కపిలేశ్వరపురంలో రంగవల్లుల పోటీల దృశ్యంఆత్రేయపురంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కపిలేశ్వరపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం స్థానిక శాఖాగ్రంథాలయం వద్ద ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించే సభలో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు శివకుమారి తెలిపారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ఆత్రేయపురం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారంవిద్యార్థులకు సీనియర్స్ జూనియర్స్ విభాగంలో పర్యావరణ పరిరక్షణలో వక్తృత్వ పోటీ, నేటి సమాజంలో గ్రంథాలయం ఆవశ్యకత అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులు ఎం.ప్రవీణ్, వి.స్వాతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వారోత్సవాల్లో భా గంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతులు అందిస్తామని గ్రంథాలయాధికారి నమశ్శివాయతెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కె.గంగవరం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): నవంబరు26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్సీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గంగవరం, కుందూరు, దంగేరు పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 400 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని సంఘ నిర్వాహకులు పి.గుణవంతుడు,ప్రేమ్‌కుమార్,రవిలు తెలిపారు.

సొంత మరుగుదొడ్లతో ఆరోగ్యం.. ఆత్మగౌరవం



రాయవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఆలమూరులో మరుగుదొడ్ల దినోత్సవ ర్యాలీ దృశ్యం



మరుగుదొడ్లు అవగాహన సమావేశంలో ఎంపీడీవో తదితరులు

ఆలమూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబం మరుగుదొడ్డిని కలిగి ఉండడంవల్ల ఆరోగ్య పరమైన సమస్యలను అధిగమించడమే కాకుండా ఆత్మ గౌరవాన్ని పెంపొందించుకోవడమేనని ఎంపీడీవో రాజు పేర్కొన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆలమూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. మన మరుగుదొడ్డి-మనగౌరవం అనే నినాదంతో ఫ్లెక్సీతో మండల పరిషత్ కార్యాలయంవద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ఆలమూరు సర్పంచ్ నాతి లావణ్య ఆధ్వర్యంలోనూ ర్యాలీ జరిగింది. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మరుగుదొడ్లతోనే పరిసరాల పరిశుభ్రత

రాయవరం: గ్రామాల్లో ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించుకుని వాటిని వినియోగించడం ద్వారానే పరిసరాల పరిశుభ్రత ఏర్పడుతుందని, దీంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మండల ప్రజాపరిషత్ ఏవో వైఎస్ఎన్ గోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం రాయవరంలో మన మరుగుదొడ్డి- మనగౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులకు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్యకుమారి, పీఆర్ ఏఈ రామనారాయణ, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటించాలి

కె.గంగవరం: ప్రతీఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా కె.గంగవరం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మరుగుదొడ్లు ఆవశ్యకతను వివరించారు. కరపత్రాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీ ఆర్డీ గౌరీకుమారి, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పి.వి.బ్రహ్మానందం పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వినియోగంపై అవగాహన పెంచాలి

ద్రాక్షారామ: ప్రతీ కుటుంబం మరుగుదొడ్లు వినియోగించేలా అవగాహన పెంచాలని మరుగుదొడ్డి వినియోగంతో గౌరవం పెరుగుతుందని ఎంపీడీవో కె.పద్మజ్యోతి అన్నారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో మరుగుదొడ్లు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి షెలత్‌రాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్యఆరోగ్యశాఖసిబ్బంది పాల్గొన్నారు.

'నాయీ బ్రాహ్మణులు ఐక్యతతో హక్కులు సాధించాలి'

రామచంద్ర పురం(ద్రాక్షారామ),నవంబరు19(ఆంధ్రజ్యోతి):నాయీబ్రాహ్మణులు ఐక్యత చాటి హక్కులు సాధించాలని ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం రామచంద్రపురంలో నాయీ బ్రా హ్మణ సంఘ కార్తీక వనసమారాధన జరిగింది. సమావేశంలో నాయీబ్రాహ్మణుల సమస్యలు ప్రస్తావించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెన్నేటి సత్యనారాయణమూర్తి, కాకినాడజిల్లా కార్యదర్శి డాక్టర్ కొమ్మన తాతారావు, తూర్పుగోదావరిజిల్లా కార్యదర్శి వద్దిపర్తి ప్రసాద్ తదితరులు మాట్లాడారు. రామచంద్రపురం నాయీ బ్రాహ్మణ పెద్దలను పట్టణ కమిటీ నాయకులు సత్కరించారు. రామచంద్రపురం పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కాజా జగన్నాధం, కార్యదర్శి బల్లిపాటి జాని, మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్ బల్లిపాటి కెంపురత్నం పాల్గొన్నారు.



నాయకులు సత్కరిస్తున్న కమిటీ సభ్యులు